Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 27.04.2018, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 47 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## స్వర్గపురికి...
# స్టైల్ ఆఫ్ సింహపురి


నా నెల్లూరా...
ఇక సెలవ్...!



- తిరిగిరాని లోకాలకు నెల్లూరు లీడర్
- శోకసంద్రంలో అభిమాన గణం
- క్యాన్సర్‌తో సుదీర్ఘకాల పోరాటం
- మృత్యువు కళ్ళ ముందున్నా రాజకీయాన్ని వదలని వివేకా

నెల్లూరు నేల పొరల్లోనుండి ఏంటి ఏడుపు వినిపిస్తోంది... నెల్లూరు వీధుల్లో ఎందుకీ రోదనలు... స్వర్ణాల చెరువు ఎందుకో విషాదంతో కనిపిస్తుంది... తల్పగిరి రంగనాథస్వామి కళ్ళల్లో ఆ కన్నీళ్ళేంటి... ఇరుకళలమ్మ ఎందుకని అంతగా గుక్కపెట్టి ఏడుస్తోంది... సంతపేట చర్చిలోని ఏసుప్రభువు ఎందుకు విలపిస్తున్నాడు... దేవుళ్ళంటే సరే... మరి ఈ అవ్వలూ, తాతలేంటి అలా దిగులుగా వున్నారు, ఈ చిన్నారులేంటి వెక్కి వెక్కి ఏడుస్తున్నారు.. అసలు నెల్లూరే శోకవనంగా మారింది... ఏమైంది, ఎందుకిలా జరిగింది. (వివరాలు 10వ పేజీలో)

## శ్రద్ధాంజలి



మాకు అత్యంత ఆప్తులు,
ఆత్మీయులు, దైవచింతనాపరులు,
మా కుటుంబ పెద్దదిక్కు

**నూకలపాటి ఆదిశేషారెడ్డి గారు**

ఏప్రియల్ 18, 2018 బుధవారం నాడు
పుట్టపర్తిలో పరమపదించారు.
వారి మృతికి చింతిస్తూ... వారి పవిత్ర ఆత్మకి
శాంతిని ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తున్నాం.

**శ్రీమతి & శ్రీ నూకలపాటి నాగ జనార్ధన్‌రెడ్డి**
కుమారుడు, న్యూజెర్సీ, యు.ఎస్.ఏ

**శ్రీమతి & శ్రీ నూకలపాటి అనిల్‌రెడ్డి**
అన్న మనుమడు, హైదరాబాద్

NAR INFRA

జననం: 31.03.1920
మరణం: 18.04.2018

**ఉత్తరక్రియలు:** తే.28.04.18ది శనివారం ఉ॥ 8.30 గం.లకు పుట్టపర్తి, ప్రశాంతి నిలయంలోని S2-B3 నివాసము నందు జరుగును.



# మెట్టలో గట్టెక్కేదెట్లా?

## తాగునీటికి ఇక్కట్లు... సాగునీటికి అగచాట్లు


**నెల్లూరు విభిన్న జీవన విధానాల సమూహం. ఈ జిల్లాలో తూర్పు ప్రాంతం గ్రామాలకు వెళితే పచ్చటి పైర్లు... నిటారుగా పెరిగిన కొబ్బరిచెట్లు... నీళ్ళతో కళకళలాడే కాలువలు... అచ్చం కోనసీమను తలపించేలా వుంటుంది వాతావరణం. ఇక గ్రామాలలో చూస్తే పేరుకు పల్లెటూర్లు అయినా అన్నీ మిద్దెలే. ఎక్కువ శాతం మంది ఆస్తిపరులే. ప్రతి ఇంట్లో కారు, కనీసం బైక్... విలాసవంతమైన జీవితం. మరి పడమర పల్లెల్లోకి వెళితే బీడుబారిన భూములు, ఎండిపోయిన పైర్లు, ఇంకిన బావులు, బొంతరాళ్ళతో కట్టిన ఇళ్ళు, బీటలు వారిన కాలువలు... ఇదీ పరిస్థితి. పడమర ప్రాంతమైన ఉదయగిరి చుట్టుపక్కల మండలాలకు వెళితే ఈ రోజుకీ మనకు ఈ వాతావరణం కనిపిస్తుంది.**

నెల్లూరుజిల్లాలో ఎక్కువుగా వలసలు పోయే ప్రాంతం ఏదన్నా వుందంటే అది ఉదయగిరి ప్రాంతమే. ఈ ప్రాంతం వాసులు ప్రపంచంలో అన్ని ప్రాంతాల్లో వుంటారు. అంతెందుకు నెల్లూరు నగరంలో సైతం ఈరోజు ఈ ప్రాంతవాసులే అధికం. ఇక్కడ ప్రతిఏటా నెలకొనే కరువు కాటకాలు, నీళ్ళు లేక వ్యవసాయ పనులు తగ్గిపోవడం, ఉపాధి పరంగా ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడంతో ప్రతి సంవత్సరం ఉదయగిరి, సీతారాంపురం, కొండాపురం, వింజమూరు, దుత్తలూరు, మర్రిపాడు వంటి మండలాల నుండి పెద్దఎత్తున వలసలు పోతుంటారు.

ఈ కరువు ప్రాంతంలో వలసలను నిరోధించడానికి, వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా ఉపాధి మార్గాలు చూపించడానికి ఏ ప్రభుత్వం కూడా ప్రయత్నం చేయలేదు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి జరిగినా అదంతా కూడా తూర్పు ప్రాంతానికే పరిమితమైపోయింది. ఈ ప్రాంతంలో కనీసం వందమందికి ఉద్యోగాలిచ్చే పరిశ్రమ ఒక్కటీ లేదు.

"అంగట్లో అన్నీ వున్నా అల్లుడినోట్లో శని" అన్నట్లు సోమశిల నుండి 200 కిలోమీటర్ల దూరంలో వున్న చెన్నైకు నీళ్ళు పారుతుంటాయి. గట్టిగా పాతిక కిలోమీటర్ల దూరంలో కూడా లేని ఈ మెట్ట మండలాలకు సోమశిల నీళ్ళుందవు. కారణం ఇది ఎత్తు ప్రాంతం కావడం. వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తయ్యుంటే ఈ మెట్ట ప్రాంతం కొంతవరకన్నా కరువు కోరల నుండి బయటపడి వుండేది. వైయస్సే ఉండుంటే వెలుగొండ పూర్తై ఈ ప్రాంత రూపురేఖలు మారివుండేవి. ఆయన మరణం ఈ ప్రాంతానికి శాపంగా మారిందని చెప్పవచ్చు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా వున్న ఆనం రామనారాయణరెడ్డి సోమశిల నుండి ఈ ప్రాంతానికి సోమశిల హైలెవల్ కెనాల్‌ను మంజూరు చేయించారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక ఈ పనుల్లో ఊపులేదు. ఈ కెనాల్ పూర్తయినా పెన్న నీళ్ళు అంది ఈ ప్రాంతపు నేలలకు నీళ్ళందుతాయి. వ్యవసాయ పరిస్థితులు మెరుగుపడతాయి.

ఎండాకాలం వచ్చిందంటే ఈ మండలాలలో తాగునీటి సమస్యలు తలెత్తుతాయి. గత ఏడాది వర్షాలు లేవు. చెరువులు, బావులు నిండ లేదు. భూగర్భ జలాలు పెరగలేదు. అరకొర వర్షాలు పడినా ఇంత కాలం తాగునీళ్ళకు ఇబ్బంది లేకుండా నెట్టుకొచ్చారు. ఇప్పుడు ఎండలు ముదిరిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఉదయగిరి పల్లెల్లో అప్పుడే నీటిఎద్దడి ఛాయలు కనిపిస్తున్నాయి. సాగునీళ్ళు అంటే ఎలాగూ ఇవ్వడం లేదు. కనీసం తాగునీళ్ళ సమస్యైనా ముందస్తు జాగ్రత్త చర్యలతో తీర్చాల్సివుంది.



# హరే రామ హరే కృష్ణ...

## మార్మోగిన జగన్నినాదం పులకించిన 'పేట' భక్తజనం



"హరే రామ హరే కృష్ణ" అంటూ వేలాదిమంది భక్తులు చేస్తున్న సంకీర్తనల మధ్య ఈ నెల 22వ తేదీన సూళ్లూరుపేటలో జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. షార్ బస్టాండ్ సమీపంలోని శ్రీ లక్ష్మి థియేటర్ వద్ద సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, రథయాత్ర నిర్వాహకులు కాళంగి ప్రభాకర్‌లు ప్రారంభించారు. ఇక్కడ నుండి మొదలైన రథయాత్ర శేషసాయి కళ్యాణ మండపం వరకు సాగింది. దారి పొడవునా భక్తులు బలరాములను దర్శించుకుని తరించారు. పండరీ భజనలు, కులుకు భజనలు, ఇస్కాన్ భక్తుల సంకీర్తనలు భక్తులను అలరించాయి. దారి పొడవునా భక్తులు రథయాత్రకు పూలు చల్లి స్వాగతం పలికారు. అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షులు(ఇస్కాన్) ప్రతినిధి డాక్టర్ శుక దేవస్వామి ఇచ్చిన ప్రవచనాలు భక్తులను తన్మయత్వంలో ముంచెత్తాయి.



# నెల్లూరు క్యాన్సర్ ఆసుపత్రి నిధులను మళ్లిస్తారా?

## ప్రజాదీవెన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్

మూడేళ్ళ క్రితం నెల్లూరు క్యాన్సర్ ఆసుపత్రికి కేంద్రం మంజూరు చేసిన 48కోట్ల నిధులను జిల్లా మంత్రులు, అధికార యంత్రాంగం అసమర్ధత వల్లే వైజాగ్‌కు మళ్ళించారని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ విమర్శించాడు. 25వ తేదీన నెల్లూరు 14వ డివిజన్‌లోని పద్మావతినగర్, వికాస్ స్కూల్ వీధి ప్రాంతంలో ఆయన ప్రజాదీవెన కార్యక్రమాన్ని నిర్వహించాడు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ నెల్లూరులో ఒక క్యాన్సర్ ఆసుపత్రి వుందని, ఇంకో ఆసుపత్రి అవసరం లేదని చెప్పి దారి మళ్ళించారని, ఇప్పుడున్న ఆసుపత్రి ప్రైవేటీకరణ అయ్యిందని, ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రి వచ్చుంటే నెల్లూరుజిల్లాలోని క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఎంతగానో ఉపయోగపడేదన్నారు. మంత్రి నారాయణ పనిగట్టుకుని జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించాడు.

ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కర్తం ప్రతాప్‌రెడ్డి, లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, వి.ప్రసన్నరెడ్డి, బిజివేముల పిచ్చిరెడ్డి, పి.సాకేత్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, ఓబుల్‌రెడ్డి, శివారెడ్డి, మీరాబాషా, చంద్రశేఖర్, ముదిరెడ్డి లక్ష్మీరెడ్డి, యం.సుబ్బారెడ్డి, గణేశం వెంకటేశ్వర్లురెడ్డి, దార్ల వెంకటేశ్వర్లు, ముడియాల దశరథరామిరెడ్డి, బిజివేముల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాయిదాపడ్డ ప్రజాప్రస్థానం

**28 నుండి మొదలు**



ఈ నెల 26వ తేదీ నుండి మొదలుపెట్టాలనుకున్న నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 366రోజుల ప్రజాప్రస్థానం పాదయాత్ర ఈ నెల 28వ తేదీ శనివారానికి వాయిదా పడింది. మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి మృతి కారణంగా ఆయన యాత్రను రెండురోజులు వాయిదా వేసాడు. 28వ తేదీ యధావిధిగా రామలింగాపురం సెంటర్ నుండి పాదయాత్ర మొదలుకానుంది. ప్రజాప్రస్థానం పాదయాత్ర కోసం గత కొద్దిరోజులుగా ఆయన రూరల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ మహిళల ఆశీర్వాదాలు అందుకోవడం తెలిసిందే!

# సర్వేపల్లి రమణయ్య సేవలు చిరస్మరణీయం

సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సమాజసేవాభిలాషి సర్వేపల్లి రమణయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఇటీవల మరణించిన సర్వేపల్లి రమణయ్య స్మృత్యంకంగా ఈనెల 19న టౌన్‌హాల్ ప్రాంగణంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి(జూనియర్) స్మారక భవనంలో నిర్వహించిన సంతాపసభలో పలువురు ప్రముఖులు పాల్గొని రమణయ్య చిత్రానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సర్వేపల్లి రామమూర్తి, సర్వేపల్లి ప్రభాకరరావుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సంస్మరణ సభలో మంత్రి ఓయస్డీ పెంచలరెడ్డి, 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, ఆచార్య ఆదిత్య, ఏపియుడబ్ల్యుజె నాయకుడు ఏ.జయప్రకాష్, ప్రముఖ రంగస్థలనటుడు వల్లకవి వెంకటసుబ్బారావు, బిరుదవోలు రామిరెడ్డి, డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎస్.అజయ్‌కుమార్, విరపు లలితారామ్, ఊరుబిండి సుబ్రహ్మణ్యశాస్త్రి, ములుముడి ప్రభాకరరావు, అన్నవరం సత్యనారాయణ, ఆలూరు శిరోమణిశర్మ తదితరులు పాల్గొని రమణయ్య సామాజిక సేవలను ప్రశంసించారు.



సర్వేపల్లి రమణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యఅతిథులు

# ఏపిజెఎఫ్ జిల్లా అధ్యక్షులుగా ఖాజా

గత 15ఏళ్ళుగా జిల్లాలో వివిధ టీవీ ఛానెల్స్ ప్రతినిధిగా సేవలందిస్తున్న టి.ఖాజా ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికయ్యాడు. గురువారం నెల్లూరులోని హోటల్ డి.ఆర్ ఉత్తమలో జరిగిన ఫోరం సమావేశంలో ఫోరంకు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీకి కార్యదర్శిగా మునీంద్రను, ఉపాధ్యక్షులుగా జనార్ధన్, సుధాకర్‌లను, కోశాధికారిగా మహబూబ్‌బాషాను, కార్యనిర్వాహక కార్యదర్శిగా శ్రీనివాసులును ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఖాజా ఫోరంకు రెండుసార్లు ప్రధానకార్యదర్శిగా కూడా పని చేశాడు. 2018-19 అక్రిడేషన్ కమిటీలోనూ సభ్యుడిగా కొనసాగుతున్నాడు.



అధ్యక్షుడిగా ఎన్నికైన ఖాజాను సత్కరిస్తున్న ఏపిజెఎఫ్ నాయకులు



# నెల్లూరు నగరంలో...

# జన సేవకుడి వైపు జనసేన చూపు



*ప్రస్తుత రాజకీయాలలో ముఖ్యంగా నవ్యాంధ్ర రాజకీయాలలో, మరీ ముఖ్యంగా నెల్లూరుజిల్లా రాజకీయాలలో రాబోయే ఎన్నికల్లో అత్యంత కీలకపాత్ర పోషించనున్న పార్టీ "జనసేన". ఆ పార్టీ అధికారంలోకి వస్తుందా.. రాదా..? అన్న విషయం పక్కనపెడితే జనసేన తరపున పోటీ చేయబోయే అభ్యర్థుల ప్రభావం ప్రక్క పార్టీల గెలుపు ఓటములను తేల్చగలదన్నది కాదనలేని సత్యం.*

రాజకీయాలలో ఇప్పుడిప్పుడే తప్పటడుగులు వేస్తున్న జనసేన అభ్యర్థుల విషయంలో తప్పటడుగులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం చాలావుంది. జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ అగ్రజుడు మెగాస్టార్ చిరంజీవి దగాపడింది అభ్యర్థుల ఎంపికలోనే. పూర్తిస్థాయిలో చిరంజీవి విఫలమయ్యింది కూడా అక్కడే. రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో పార్టీ స్థాపించి కనీసం రెండు పదుల సీట్లు కూడా పొందలేకపోవడం చిరంజీవి రాజకీయ అనుభవ రాహిత్యానికి నిలువెత్తు సాక్ష్యం. అలాంటి క్లిష్ట సమయంలో కూడా నెల్లూరులో ప్రజారాజ్యం గెలిచిందంటే ఇక్కడ చిరంజీవికి అతని కుటుంబానికి నెల్లూరుతో వున్న సాన్నిహిత్యం, నెల్లూరీయులతో వున్న అనుబంధం కొంత ఉపయోగపడిందన్నది ఎవ్వరూ ఖండించలేని వాస్తవం.

ఇప్పుడు పవన్‌కళ్యాణ్ కూడా నెల్లూరుపైన ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు వినికిడి. ఇప్పటికే రాజకీయాలలో వున్న వ్యక్తులని కాకుండా, రాజకీయాలకు పూర్తిగా కొత్తవారై వుండి సేవారంగంలో చిరపరిచితులై వుండాలన్న కోణంలో అభ్యర్థుల వేట కొనసాగిస్తున్నారని తెలుస్తోంది. ఎలాంటి స్వార్థం, స్వలాభం లేకుండా తనకున్న ఆర్థిక బలం, అంగ బలాన్ని ప్రజాసేవకు ఉపయోగించే యువతరం కోసం ఆ పార్టీ చూస్తోందన్నది సర్వత్రా వినిపిస్తున్న వార్త.

ఈ క్రమంలో నెల్లూరు నగరంలో వారి దృష్టి మాగుంట శరత్‌చంద్రారెడ్డిపై పడ్డట్లు తెలుస్తోంది. జనసేన ద్వారా తన ఇమేజ్‌ని పెంచుకుంటూ మరో వైపు మాగుంట సుబ్బరామరెడ్డి స్ఫూర్తితో ఆయన చూపించిన మార్గంలో నడుస్తూ సేవకేదీ కాదు అనర్హం అన్నట్లు ప్రజోపయోగ కార్యక్రమమేదైనా తానున్నానని ముందుకొస్తున్న శరత్‌చంద్రారెడ్డి ఇప్పుడు జనసేన పార్టీకి ఆకర్షణగా నిలిచాడని వార్త. 10వ తరగతి ఇంటర్మీడియట్ పిల్లల పరీక్షల సమయంలో విద్యార్థినీ విద్యార్థులకు వారి తల్లితండ్రులకు ఉచిత బస్సు వసతిని కల్పించడం, తమ చిన్నారులు పరీక్షలు రాస్తుంటే వారి కోసం నిరీక్షించే అమ్మానాన్నలకు షామియానాల ద్వారా నీడను కల్పించడం, ఆకలితో అలమటించే పేద కుటుంబాలను ఆదుకోవడం, ప్రతియేటా తన జన్మదినం రోజున వందల యూనిట్ల రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు కుట్టుమిషన్లు పంపిణీ చేయడం, చీరలు అందజేయడం, వేలమందికి భోజన సదుపాయాలను సమకూర్చడం వంటి సేవా కార్యక్రమాలతో తానో యువసేనా నక్షత్రంలా మెరుస్తున్నాడు శరత్‌చంద్రారెడ్డి.

కేవలం సేవకే అంకితం కాకుండా సామాజిక స్పృహతో సమాజం పట్ల మనకున్న బాధ్యతలను గుర్తు చేస్తూ "మన ఊరు మన బాధ్యత" అంటూ ట్రాఫిక్ నియంత్రణ ప్రచారం, స్వచ్ఛభారత్ కార్యక్రమాలతో పాటు ప్రజలకు ఉపయోగపడే "ప్రత్యేకహోదా" లాంటి ఉద్యమ కార్యక్రమాలను సైతం శరత్ చంద్రారెడ్డి తన సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తుండడం అందరినీ ఆకర్షిస్తోంది.

అనాధాశ్రమాలు, వృద్ధాశ్రమాలతో పాటు మానసిక వికలాంగుల సంక్షేమ కేంద్రాలలో సైతం మానవీయతను చాటుతూ తన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి.

అక్షరాలా ఇలాంటి జనసేవకుల కోసమే జనసేన వెదుకుతోంది.

ఇప్పటివరకు ప్రత్యక్ష రాజకీయాలతో సంబంధం లేకుండా దయార్ధ్రహృదయంతో సమాజసేవ చేసే శరత్‌చంద్రారెడ్డి వంటి యువత కోసం ప్రయత్నిస్తోంది జనసేన పార్టీ. ఇప్పటికే ఆ పార్టీ వర్గాలు 'శరత్‌చంద్రారెడ్డి' పుట్టుపూర్వోత్తరాలను సేకరించి ఆ కుర్రోడు చేసిన చేస్తున్న చేయబోతున్న సేవా కార్యక్రమాలను పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్ళినట్లు పవన్ మిత్రులు కొందరు చెప్తున్నారు.

యువతను చెడుదోవ పట్టనీయకుండా వారికి సామాజిక స్పృహను, సమాజం పట్ల వారి బాధ్యతలను గుర్తుచూస్తూ సేవా కార్యక్రమాలవైపు వారి దృష్టిని మరలిస్తూ నేటితరానికి కొత్త భాష్యం చెప్తున్న శరత్‌చంద్రారెడ్డి వంటి జనసేవకులు ఇప్పుడు జనసేనకు కూడా అవసరమే మరి. జన సేవకు బలం, గళం, జీవం ధైర్యం... ఇలాంటి యువ నాయకులే. వేచిచూద్దాం... ఏం జరగబోతుందో...?

## 'ప్రభా'తం

# గెలుపుగుర్రమెక్కేదెవరు?

బిజెపి-కాంగ్రెస్‌లకు కర్నాటక ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకంగా మారాయి. వచ్చే నెల 12న జరగనున్న కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు ఆ పార్టీలకు ఎంతో కీలకమైనది. దీంతో కర్నాటక రాజకీయాలు మరింత రసవత్తరంగా మారాయి. కాంగ్రెసే ఈసారి ఇక్కడ గెలుస్తుందనే ఊహాగానాలు అధికంగా ఉన్నా, విజయం కోసం బిజెపి నిరంతరకృషిలో ఉంది. అయితే, తుది నిర్ణయం ఓటర్లదే కనుక, ఓటర్లు ఎవరిని గెలిపిస్తారో..వచ్చే నెల 15న ఫలితాలు వెలువడేదాకా వేచి చూడాల్సిందే!..

ఆ రెండు పార్టీలకూ ఇప్పుడు కర్నాటక ఎంతో ప్రతిష్టాత్మకంగా తయారైంది. రానున్న ఎన్నికల్లో గెలుస్తామా లేదా అన్నదే ఆ పార్టీలకు గుబులుగా మారింది. వచ్చే నెల 12న జరగనున్న కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానంగా హోరాహోరీగా తలపడుతున్న బిజెపి-కాంగ్రెస్ పార్టీల ప్రతిష్టకు ఇవి ఎంతో కీలకమైనవని వేరే చెప్పనక్కరలేదు. రాష్ట్రంలోని 224 స్థానాలకు మే 12న ఇక్కడ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల సమయం దగ్గరపడేకొద్దీ పార్టీల నాయకులకు నిదురే కరువవుతోంది. ఎక్కడ విన్నా ఎన్నికల మాటే. ఈ ఎన్నికల్లో బిజెపి గెలుస్తుందా.. కాంగ్రెస్ నిలుస్తుందా అన్న చర్చలే. ఈ రెండు పార్టీలతో పాటు, ఈ ఎన్నికల్లో జేడీ (ఎస్)పార్టీ మద్దతు పార్టీలపై మరింత కీలకంగా ఉంటుందని కూడా రాజకీయవర్గాల అంచనాలు వేస్తున్నాయి. అయితే, ఇప్పటికే వివిధ మీడియాసంస్థలు నిర్వహించిన సర్వేలో కాంగ్రెస్‌దే పైచేయిగా ఉంది. ఇక్కడ అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్ అవతరిస్తుందనే అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. మరికొన్ని సర్వేలు బిజెపియే అధికస్థానాలు గెలుచుకుంటుందని చెప్తున్నాయి. పార్టీలకు స్వల్ప ఆధిక్యత వచ్చి 'హంగ్' ప్రభుత్వం ఏర్పడే అవకాశం కూడా లేకపోలేదు. కర్నాటక బిజెపి నేత, మాజీ సిఎం యెడ్యూరప్ప, ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న సిద్ధరామయ్య (కాంగ్రెస్)ల మధ్య పోటీ రసవత్తరంగా మారింది. ఓటర్లు ఎవరిని అందలమెక్కిస్తారో తెలియదు కానీ, ఈ ఎన్నికల పుణ్యమా అని కర్నాటక అంతా ఈ ఎండల్లో రాజకీయ సెగలతో మరింత వేడెక్కిపోతోంది. నరేంద్రమోడీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా బిజెపి బలోపేతం కావడం తెలిసిందే. అయితే, దక్షిణాదిలో ఇప్పుడు జరుగుతున్న కర్నాటక అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవడం బిజెపికి ఇదే తొలిసారి. ఇక్కడ విజయం సాధిస్తే బిజెపికి ఇక దక్షిణాదిలో కూడా తిరుగే ఉండదని ఆ పార్టీ గట్టిగా భావిస్తోంది. కర్నాటకలో గెలుపు ద్వారా దక్షిణాధిలో విజయభేరీ మోగించవచ్చని, తద్వారా రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ తమకు ఎదురుండదని బిజెపి అంచనాలు వేసుకుంటోంది. అయితే, మారుతున్న రాజకీయాల్లో కాంగ్రెస్‌కు ఇక్కడి వాతావరణం అనుకూలంగా మారుతున్నట్లు కనిపిస్తున్నా, బిజెపి కూడా ఎక్కడా తగ్గకుండా రాజకీయ వ్యూహాలు రచిస్తూనే ఉంది. ఇక్కడ విజయం అంత సులువు కాదని అర్ధమవుతున్నా, ఎలాగైనా పట్టుబట్టి విజయం సాధించాలనే పట్టుదలతో బిజెపి వ్యూహరచన చేస్తోంది. 2008 అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా కర్నాటకలో బిజెపి అధికారంలోకి వచ్చింది. అయితే, అంతర్గత విభేదాలతో తన విజయావకాశాలను తనే దెబ్బతీసుకుంది. 2013 ఎన్నికల్లో అధికారాన్ని కాంగ్రెస్‌కు బంగారుపళ్లెంలో పెట్టి మరీ అందించింది. అయితే, 2014 సార్వత్రిక ఎన్నికల్లో మోదీ ప్రభంజనంతో కర్నాటకలోని అత్యధిక పార్లమెంట్ స్థానాలు బిజెపికి లభించాయి. మొత్తం 28 లోక్‌సభ స్థానాల్లో 17 బిజెపికి రాగా, 9 స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంది. అయితే, అప్పటికీ ఇప్పటికీ పరిస్థితి మారిందని, గతంలో ఉన్నంత మోడీ ప్రభంజనం ఇప్పుడు లేదని సర్వేలు పేర్కొంటున్నాయి. మరోవైపు ఇటీవల జరిగిన ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో గోరఖ్‌పూర్, ఫూల్పూర్ లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి పరాజయం పాలవడంతో బిజెపి ఇప్పుడు మరింతగా ఆచితూచి అడుగులు వేస్తోంది. మునుపున్నంత దూకుడుగా లేకుండా జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే కర్నాటకలోని మఠాలు మఠాధిపతుల చుట్టూ తిరుగుతూ అమిత్‌షా బిజెపి ఓటుబ్యాంక్‌ను కాపాడుకోవాలని తీవ్రప్రయత్నాల్లో ఉన్నారు. ఈ ఎన్నికలో ఇక కర్నాటక నుంచి కాంగ్రెస్ తొలగిపోతుందని, ఇక్కడి గెలుపుతో దక్షిణాది జైత్రయాత్రకు సింహద్వారాన్ని తెరచినట్లేనని, ఇక్కడ గెలిస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళల్లో కూడా విజయదుంధుభులు మోగించవచ్చని బిజెపి నేత అమిత్‌షా కార్యకర్తలకు ఉత్సాహం నూరిపోస్తున్నారు. అయితే, మోడీ ప్రతిష్ట మసకబారిందని, మునుపటి పరిస్థితి ఇప్పుడు లేదని, ప్రజల్లో ఆయనపై విశ్వాసం సన్నగిల్లినట్లు ఎన్నికల ప్రచారంలో స్పష్టంగా కనిపిస్తోందని, కనుక కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో విజయం తథ్యమని కాంగ్రెస్ నాయకులు ధీమాగా చెప్తున్నారు. కాంగ్రెస్ తరపున ముఖ్యమంత్రి సిద్దరామయ్య రంగంలో ఉండడంతో, ప్రజాభిమానం మెండుగా ఉన్న ఆయన గెలుపుకు ఎలాంటి ఢోకా లేదని కాంగ్రెస్ ధీమాగా ఉంది. బిజెపి నేత, మాజీ ముఖ్యమంత్రి యెడ్యూరప్పపై కూడా ప్రజలకు అభిమానమే ఉన్నా సొంతపార్టీలోనే అసమ్మతుల కుంపట్లసెగ ఎక్కువగా ఉంది. కర్నాటకలో అనేక నియోజకవర్గాల్లో గెలుపోటములను శాసించే లింగాయతుల ఓట్ల కోసం ఇరు పార్టీలు చేస్తున్న రాజకీయ వ్యూహాలతో కర్నాటకలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కుతోంది. లింగాయత్‌లకు మైనార్టీ హోదా ఇస్తామనే తాయిలంతో ఆ వర్గాన్ని సిద్ధరామయ్య ఇప్పటికే తనవైపుకు తిప్పుకున్నారు. అత్యధికులైన లింగాయతులను తమవైపు తిప్పుకునేందుకు బిజెపి కూడా శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. అదేవిధంగా, సుమారు 35 నియోజకవర్గాల్లో ప్రభావం చూపే తెలుగు ఓటర్లు కూడా కర్నాటకలో గణనీయంగానే ఉన్నారు. బెంగుళూరులోని అత్యధిక ప్రాంతాల్లో తెలుగువారే అధికం. ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందనే ఆగ్రహం తెలుగువారిలో స్పష్టంగా ఉంది. ఈ వ్యతిరేకతే గతంలో కాంగ్రెస్‌ను మట్టికరిపించింది కూడా. ఇప్పుడు బిజెపి ఆ తప్పును సరిదిద్దకపోవడంతో కర్నాటకలోని ఆంధ్రులు బిజెపికి ఓట్లేసే పరిస్థితి ఉండదని, కనుక ఇది తమకు అనుకూలమని కాంగ్రెస్ భావిస్తోంది. ఒకవైపు బిజెపి నేత అమిత్‌షా, మరోవైపు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఇప్పటికే కర్నాటకనంతా ఒక చుట్టు చుట్టేశారు. సుడిగాలి పర్యటనలు చేస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్, దేశంలో బిజెపి అధికారంలో ఉండడం వల్ల ఆ రెండు పార్టీలకు డబ్బుకు కొదవలేదు కనుక ప్రచారార్భాటాలకు తక్కువేమీ లేదు. అయితే, ఎవరెలా ప్రచారాలు చేసుకున్నా తుది నిర్ణయం మాత్రం ఓటర్లదే కనుక, ఓటర్లు చివరికి ఎవరిని తిరస్కరిస్తారో.. ఎవరిని వరిస్తారో.. వచ్చే నెల 15న ఫలితాలు వెలువడే దాకా వేచిచూడాల్సిందే!...

# కమనీయం... శ్రీనివాస కళ్యాణం





నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధిలోని మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న వసంత పరిమళ కొౌరాయి మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 22వ తేదీ రాత్రి సింహపురి గోవిందమాల కమిటి, కనకదుర్గా సేవాసమితి, కోలపర్తి రమేష్ మిత్ర మండలి ఆధ్వర్యంలో శ్రీనివాస కళ్యాణోత్సవం కమనీయంగా జరిగింది. సింహపురి గోవిందమాల కమిటీ ఆధ్వర్యంలో 108 కళ్యాణోత్సవాలను పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహించిన వేడుకలో 108 మంది దంపతులచే కళ్యాణోత్సవాన్ని జరిపించారు. విశేషంగా అలంకరించిన వేదికపై కొలువుదీరిన మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కళ్యాణాన్ని వేదపండితులు వేదగిరి ఫణిశర్మ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కళ్యాణోత్సవాన్ని తిలకించారు.

కోలపర్తి వెంకటరమేష్‌కుమార్, కార్యనిర్వహణాధికారి రామకృష్ణ, పప్పులవీధి మిత్రమండలి, మహిళా మండలి పర్యవేక్షణలో ఈ కళ్యాణోత్సవం జరిగింది.

# గీతాంజలి అధ్యాపకునికి డాక్టరేట్



డా. ఎం.గణపతిని సత్కరిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో గణితశాస్త్ర అధ్యాపకునిగా పని చేస్తున్న ఎం.గణపతికి డాక్టరేట్ లభించింది. 'సమ్ థియరిటికల్ స్టడీస్ ఇన్‌ది ల్యూబ్రికేషన్ ఆఫ్ సర్క్యులర్ అండ్ నాన్ సర్క్యులర్ బేరింగ్స్ కన్సిడరింగ్ ఆడిటల్ అండ్ థర్మల్ ఎఫెక్ట్స్' అనే అంశంపై తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తమ అధ్యాపకునికి డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా. జి.సుబ్బారావు తెలియజేశారు. కళాశాల సెక్రటరీ–కరెస్పాండెంట్ ఎన్.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, తమ కళాశాల రాష్ట్రస్థాయిలో ప్రతిష్టాత్మక విజయాలు సాధిస్తోందని, అందుకు ఇక్కడున్న డాక్టరేట్‌లు పొందిన అధ్యాపకులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవన్నారు. అనంతరం డా. ఎం.గణపతిని అందరూ ఘనంగా సత్కరించారు.

## పోయే కాలానికి పెడబుద్ధులు

ఏడుకొండలను రెండు కొండలు చేసాడంటూ గతంలో దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డిపై ఎల్లో మీడియా నానా యాగీ చేసింది. మరిప్పుడు చంద్రబాబు చేసిందేమిటి? క్రైస్తవ మత సభలకు విరాళాలిచ్చే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను టీటీడీ ఛైర్మెన్‌గా చేసాడు. ఇక నా బ్యాగ్‌లో ఎప్పుడూ బైబిల్ వుంటుంది, నా కారులోనూ బైబిల్ వుంటుంది, నేను పక్కా క్రిస్టియన్‌ని అని స్వయంగా చెప్పుకున్న ఎమ్మెల్యే అనితను టీటీడీ బోర్డు సభ్యురాలిగా నియమించారు. హిందూ ధార్మిక సంస్థ పట్ల ఇదేనా ఆయనకున్న గౌరవం. వక్ఫ్‌బోర్డుకు, లేదా మిషనరీలకు ఇలాగే హిందువులను నియమించగలడా?

**సి.రాజీవి, నెల్లూరు.**

## దండగ మీడియా

ఆంధ్రప్రదేశ్‌లో వున్నంత పనికిమాలిన మీడియా ప్రపంచంలోనే ఎక్కడా వుండదేమో? ప్రజల సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలు, అధికార యంత్రాంగం యొక్క నిర్లక్ష్యం, సమాజంలో జరుగుతున్న దుర్మార్గాలు మీడియాకు వార్తాంశాలే కావాలిగాని, ఎవరు బట్టలు విప్పుకుంటున్నారు, ఎవరు బట్టలేసుకుంటున్నారు, ఎవరు ఏ సందుల్లో దూరుతున్నారు... ఇవి కాదు కావాల్సింది. తెలుగు మీడియా ఒక కులానికి ఇస్తున్న ప్రాధాన్యత రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడం కోసం ఇవ్వడం లేదు. వ్యక్తిగత వివాదాలపై చూపే శ్రద్ధ ప్రభుత్వ వైఫల్యాలపై చూపడం లేదు. ఇలాంటి చెత్త మీడియాను ప్రజలు ఛీ కొడుతున్నారు.

**– టి.పరశురాం, నెల్లూరు.**

## దీక్షలు ఇలా కూడా చేస్తారా?

మహాత్మాగాంధీ నిరాహరదీక్ష చేసాడు, పొట్టి శ్రీరాములు నిరాహారదీక్ష చేసాడు, అన్నాహజారే చేసాడు, కేసీఆర్ కూడా చేసాడు. అవి నిరాహార దీక్షలుగానే వున్నాయి. వారు చేసిన దీక్షల్లో చిత్తశుద్ధి వుంది. కాని మొన్న విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన దీక్షనే ఏమనాలో అర్ధం కావడం లేదు. దీనిని కూడా దీక్ష అంటారా? లేక ఉపవాసం అంటారా? హిందువులు కార్తీకపౌర్ణమి, శ్రావణ శుక్రవారం వంటి పండుగల్లో రోజు మొత్తం ఉపవాసం ఉంటారు, ముస్లింలు రంజాన్ మాసమంతా ఉపవాసం ఉంటారు. చంద్రబాబు దీక్ష ఆ మాత్రం కూడా లేదు. 30కోట్లు ఖర్చు చేసి, పత్రికల్లో కోట్ల రూపాయల విలువచేసే ప్రకటనలిచ్చి చుట్టూ ఏసిలు, కూర్చోవడానికి మెత్తటి పరుపులు వేసుకుని ఒక పూట భోజనం చేయని దానికి కూడా ధర్మపోరాట దీక్ష అని ప్రచారం చేసుకుంటే చిత్తశుద్ధితో చేసే నిరాహారదీక్షలకు అర్ధం లేకుండా పోతుంది.

**జైరెడ్డి కొండారెడ్డి, బద్వేల్.**



# నెల్లూరు దారెటు?

*రాష్ట్రంలోనే చంద్రబాబుకు మింగుడుపడని జిల్లా ఏదన్నా ఉందంటే అది నెల్లూరే! ఇక్కడ ప్రతిపక్ష వైసిపి బలంగా వుంది. 2014 ఎన్నికల్లో ఆ పార్టీకే మెజార్టీ సీట్లొచ్చాయి. అందుకే చంద్రబాబు సీఎం అయ్యాక ఏ జిల్లా మీద లేని కసి నెల్లూరుజిల్లా ప్రజల మీద పెంచుకున్నాడు. పలు సందర్భాల్లో ఆయన ఈ కసిని బయటపెట్టుకున్నాడు కూడా! అధికారంలోకి వచ్చాక రెండేళ్ళపాటు నెల్లూరుజిల్లాపై ఆయన సవతిప్రేమనే చూపాడు. ఒక్క జాతీయ సంస్థను కాని, ఒక్క ఇండస్ట్రీని కాని ఆయన నెల్లూరుజిల్లాకు ఇవ్వలేదు.*

గతం గతః అన్నట్లు జరిగిందేదో జరిగిపోయిందనుకుని గత రెండేళ్ళ నుండి కొంచెం మనసు మార్చుకుని కొంతవరకు జిల్లాలో అభివృద్ధి పనులకు సహకరిస్తున్నాడు. జిల్లా నుండి రెండో మంత్రిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని తీసుకున్నప్పుడే చంద్రబాబు మనసు కొంచెం మారినట్లయ్యింది. మున్సిపల్ మంత్రిగా నారాయణ, వ్యవసాయ శాఖ మంత్రిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బీద రవిచంద్ర ఎవరి స్థాయిలో వాళ్ళు పార్టీని పైకి లేపడానికి జాకీలు వేస్తూనే వున్నారు. అయితే జిల్లాలో పార్టీ పైకి లేస్తేగా... వీళ్ళు ఎంత ప్రయత్నించినా పార్టీ బలం పుంజుకోవడం లేదు సరికదా, జిల్లాలో వైసిపి మరింత బలం పుంజుకుంటున్న ఛాయలు కనిపిస్తున్నాయి. ఈసారి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పోటీ చేయకపోతే నెల్లూరు లోక్‌సభకు పార్టీలో గట్టి అభ్యర్థే లేదు. జిల్లాలోని 10అసెంబ్లీ నియోజకవర్గాలలోనూ ఢంకా బజాయించి ఈ సీటు గెలుస్తామని చెప్పడానికి ఒక్క సీటు కూడా లేదు. సర్వేపల్లిలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆత్మకూరులో ఆనం రామనారాయణరెడ్డి (పార్టీ మారకుంటే), కావలిలో బీద మస్తాన్‌రావులు మాత్రమే గట్టిపోటీ ఇవ్వగలరని తెలుస్తోంది. ఆదాల టీడీపీలోనే వుండి నెల్లూరురూరల్‌లో పోటీ చేస్తే ఆయన కూడా గట్టి పోటీనే ఇవ్వొచ్చు. వీళ్ళు కాకుండా ఉదయగిరి, వెంకటగిరి, కోవూరులలో సిటింగ్ ఎమ్మెల్యేల మీద తీవ్ర వ్యతిరేకత వుంది. మళ్ళీ వాళ్ళకే సీట్లిస్తే ఓడిపోవడం ఖాయమని ఆ పార్టీ నాయకులే అంటున్నారు. అలాగని వారి స్థానాలలో కొత్త వారిని తెద్దామా అంటే... ఇప్పుడున్న పరిస్థితుల్లో వాళ్ళకంటే బెటర్ అభ్యర్థులు పార్టీలో లేరు. గూడూరులో సిటింగ్ ఎమ్మెల్యే పాశం సునీల్‌కే సీటిస్తే అది కూడా ఓడిపోతుందనే ప్రచారం వుంది. నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలలో పార్టీ చంద్రబాబు పుణ్యాన చాలా బలహీనంగా వుంది. నారాయణ లాంటి వాళ్ళను దించినా పార్టీ ఎంతవరకు బలపడుతుందో చెప్పలేని పరిస్థితి. సూళ్ళూరుపేట నియోజకవర్గంలో అయితే వైసిపి ఎమ్మెల్యే సంజీవయ్యకు సరిజోడు దొరకడం టీడీపీకి గగనంగా వుంది.

మొత్తంగా చూస్తే జిల్లాలో టిడిపి పరిస్థితి బాగాలేదు. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో పార్టీ ఇంకా బలహీనపడుతోంది. నాయకులు ఎన్ని పాదయాత్రలు, ఎన్ని సైకిల్ యాత్రలు చేసినా ఓటర్లను సైకిలెక్కించడం కష్టంగా వుంది.



- టీడీపీకి పజిల్‌గా మారిన నెల్లూరు జిల్లా
- ఎంత బూస్ట్ ఇచ్చినా బలం పెరగడం లేదు

# లారీ ఓనర్ల సమస్యలు తీరుస్తాం!

## మంత్రి డా. నారాయణ



లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పి.నారాయణ

లారీ ఓనర్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా.పొంగూరు నారాయణ అన్నారు. ఈ నెల 22న నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో, ఎస్‌పిఎస్‌ఆర్ జిల్లా లారీ ఓనర్ల అసోసియేషన్ నూతన భవనాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, ఇళ్ళ స్థలాల కేటాయింపు విషయమై మరోసారి చర్చించి నిర్ణయించడం జరుగుతుందన్నారు. పేద, బడుగు బలహీన వర్గాలకై నిర్మించనున్న 43వేల ఇళ్ళకు సంబంధించి 400 ఎకరాల స్థలం అవసరం కాగా, ఇప్పటిదాకా 200 ఎకరాల ప్రభుత్వభూములను సేకరించడం జరిగిందన్నారు. మిగిలిన 200 ఎకరాల కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కృష్ణపట్నం పోర్టు నుంచి సరుకుల తరలింపు విషయంలో స్థానికంగా ఉన్న లారీలకు ప్రాధాన్యత ఇచ్చేలా సంబంధిత అధికారులతో సంప్రదిస్తామన్నారు. జిల్లాలో మొత్తం 5వేలకు పైగానే లారీలు ఉన్నాయని, ఒక్క నెల్లూరు నగరంలోనే సుమారు 2వేల లారీల దాకా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, లారీ ఓనర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాలనాయుడు, జిల్లా శాఖ అధ్యక్షుడు చిన్నారెడ్డి, కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆశలకు తెరపడినట్లే!



*ఈరోజా... రేపా... అనుకుంటూ జిల్లా తెలుగుదేశం పార్టీలో చాలామంది నాయకులు నాలుగేళ్ళుగా ఎదురుచూపులు చూసారు. ఏదో ఒకరోజు తమకు అదృష్టం పడుతుందని ఆశపడ్డారు. ఆ ఆశలన్నీ గల్లంతైనట్లే... ప్రభుత్వం అధికారంలోకొచ్చి నాలుగేళ్ళయ్యింది. ఇక వుండేది ఏడాది కాలమే. అది కూడా ఇక ఎన్నికల సీజన్. నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్న ఆలోచన కూడా ఉండదు. ఇక సీట్లు, అభ్యర్థులు, నోట్లు, గెలుపోటములు... ఇదే టాపిక్!*

కంభం విజయరామిరెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డి, దేశాయిశెట్టి హనుమంతురావు, డాక్టర్ జడ్.శివప్రసాద్, టి.అనూరాధ, డాక్టర్ జ్యోత్స్నలత... వీళ్ళంతా పార్టీని నమ్ముకున్నోళ్లే! పార్టీ జెండాలు మోసినోళ్ళే! పార్టీ కోసం అంతో ఇంతో నష్టపోయినవాళ్ళే! నామినేటెడ్ పదవుల విషయంలో నాలుగేళ్ళుగా వీళ్ళ పేర్లు వార్తల్లో వుంటూనే వున్నాయి. ఇంతవరకు ఒక్కరికీ పదవి దక్కలేదు. చివరాఖరుగా అన్నట్లు ఇటీవల టీటీడీ ఛైర్మెన్ పదవితో పాటు ఆర్టీసీ రీజియన్ ఛైర్మెన్ పదవులను కూడా భర్తీ చేసారు. నెల్లూరు రీజియన్ ఛైర్మెన్ పదవిని తీసుకుపోయి చిత్తూరుజిల్లా వాళ్ళకిచ్చారు. టీటీడీ బోర్డు సభ్యులుగా జిల్లాలో ఒక్కరికీ అవకాశం ఇవ్వలేదు. జిల్లాలో ఒకరికి సభ్యుడిగా అవకాశం రావచ్చనే ఆశ కూడా పోయింది. ఈ టర్మ్‌కు ఈ విధంగా సరిపెట్టుకోక తప్పదు.

# మేకపాటికి వీరగంధం

## ఘనస్వాగతం పలికిన వైసిపి శ్రేణులు

మేకపాటి రాజమోహన్‌రెడ్డి 2009 నుండి నెల్లూరు పార్లమెంటు సభ్యుడిగా వుంటున్నాడు. ఒకసారి వై.యస్. గాలితో, రెండుసార్లు జగన్ గాలితో లోక్‌సభ నుండి గెలిచాడు. అయితే ఎంపీగా ఈ 9ఏళ్ళ కాలంలో ప్రజలు మెచ్చే పనులేమీ చేయలేదు. ప్రజల్లో ప్రత్యేకగుర్తింపు తెచ్చుకునే ప్రయత్నమేదీ చేయలేదు. కాని ప్రత్యేక హోదా ఉద్యమంలో ఆయన నిర్వహించిన పాత్ర ప్రజాదరణ పొందింది. ప్రత్యేక హోదా కోసం తన పదవికి రాజీనామా చేయడమే కాక ఢిల్లీలో నిర్వహించిన నిరాహారదీక్షా శిబిరంలో 73ఏళ్ళ వయసులోనూ కూర్చున్నాడు. రెండోరోజే ఆసుపత్రికి పట్టుకుపోయారనుకోండి... అయినా కూడా ప్రత్యేకహోదా పోరాటంలో ఆయన చేసిన చిత్తశుద్ధి పోరాటం వైకాపా శ్రేణుల్లోనూ ఆయనపై వున్న వ్యతిరేకతను తొలగించిందనే చెప్పవచ్చు.



ర్యాలీగా తరలివస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి

తన పదవికి రాజీనామా చేసి ఢిల్లీ నుండి 23వ తేదీ పినాకిని రైలులో నెల్లూరుకు చేరుకున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డికి వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. రైల్వేస్టేషన్ నుండి బోసుబొమ్మ, గాంధీబొమ్మ, ఆర్టీసీ, కెవిఆర్ పెట్రోల్ బంకుల మీదుగా మాగుంట లే అవుట్‌లోని వైకాపా జిల్లా కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా మోతలతో, వివిధ వాయిద్యాలతో ర్యాలీలో మోతమోగింది. పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో వైసిపి నాయకులు, కార్యకర్తలు మేకపాటిని ఘనంగా సత్కరించారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్ యాదవ్, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో రెండు నియోజకవర్గాల నుండి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నెల్లూరు పార్లమెంట్ కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మేకపాటి గౌతమ్ రెడ్డి, కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు వంటేరు వేణుగోపాలరెడ్డి, ఆనం విజయ కుమార్‌రెడ్డి, మాధవరెడ్డి, మేకపాటి చంద్ర శేఖర్‌రెడ్డి, మేరిగ మురళి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘ వేంద్రరెడ్డి, నేదురుమల్లి పద్మనాభరెడ్డి, పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఎల్లసిరి గోపాలరెడ్డి, ముక్కాల ద్వారకా నాథ్, పి.రూప్‌కుమార్‌యాదవ్, తాటి వెంకటేశ్వర్లు, మొయిళ్ళ గౌరి, తోటా శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# పారదర్శకంగా పోలీస్ బదిలీలు

## ప్రశంసలందుకున్న జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ



కౌన్సిలింగ్ తరహాలో బదిలీల ప్రక్రియను నిర్వహిస్తున్న ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ

అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో పోలీసుశాఖలో బదిలీలు చేసి జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ అందరి ప్రశంసలందుకున్నారు. జిల్లా చరిత్రలోనే ప్రథమంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మెడికల్, ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ తరహాలో వారికి నచ్చిన స్థానంలో ఎంపిక చేసి, ఎలాంటి పైరవీలకు ఆస్కారం లేకుండా పోలీసుల బదిలీల ప్రక్రియను కొనసాగించడం అందరి మన్ననలకు పాత్రమవుతోంది. ఈనెల 21, 22, 23తేదీలలో నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో బదిలీల ప్రక్రియ ఎంతో ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగింది. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా పారదర్శకంగా ఉండేందుకు ఒక కమిటీని ఏర్పాటుచేసి ఈ బదిలీల ప్రక్రియ కొనసాగించడం విశేషం. ఈ బదిలీలపై జిల్లా పోలీసు సిబ్బంది, వారి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మొత్తం ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు, మహిళా సిబ్బంది కలిపి 561మందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. ఎస్పీ రామకృష్ణ ఏ ఏ స్టేషన్‌లలో ఎన్నెన్ని ఖాళీలున్నాయో స్వయంగా వివరాలు సేకరించి అన్ని చోట్ల తగిన సిబ్బంది ఉండేటట్లు బదిలీలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో 5 ఏళ్ళు, సర్కిల్ పరిధిలో 12ఏళ్ళు, సబ్‌డివిజన్ పరిధిలో 18ఏళ్ళు సర్వీసు పూర్తయిన సిబ్బందిని పరిగణనలోకి తీసుకుని బదిలీల ప్రక్రియ నిర్వహించారు. ఈ బదిలీల ప్రక్రియలో అడిషనల్ ఎస్పీ శరత్‌బాబు, డిఎస్పీలు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీసు అధికారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా గ్రాడ్యుయేషన్ డే



యుఎన్‌ఆర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులతో ముఖ్యఅతిథులు

నెల్లూరు నవాబుపేట, రామచంద్రాపురంలోని యుఎన్‌ఆర్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే, వార్షికోత్సవాన్ని ఈ నెల 23న వైభవంగా జరుపుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ముఖ్యఅతిథులను, తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఎస్ఎస్ నాయుడు, దేవరాల సుబ్రహ్మణ్యం, నెపస్మా నాయకులు మైథిలి మనోహర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శౌరెడ్డి, సైకాలజిస్ట్ సిహెచ్ రమేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ యుఎన్‌ఆర్ పాఠశాల గత 35 సంవత్సరాలుగా తల్లిదండ్రుల మన్ననలు పొందుతుందని, స్కూలు కరస్పాండెంట్ నరసారెడ్డి పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

# విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ



విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేసిన క్లబ్ ప్రతినిధులు

లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు పినాకిని సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 23న నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న దాదాపు 300 మంది విద్యార్థిని, విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన 70మంది విద్యార్థినీవిద్యార్థులకు ఉచితంగా కంటిఅద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పినాకిని క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ పి.సీతారామారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థినీ విద్యార్థులకు ఇటువంటి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు యం.విక్రమ్, హైస్కూలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# యంయస్‌ఆర్ సేవాసమితి మజ్జిగ చలివేంద్రం




మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాగుంట శరత్‌చంద్రారెడ్డి(చందు)

నెల్లూరు నగరంలో ఆ కాలం ఈ కాలం అని లేకుండా కాలానికి తగ్గట్లుగా జనానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించే మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి వాళ్ళు ప్రస్తుతం మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని విఆర్‌సి సెంటర్ వద్ద మజ్జిగ మరియు మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సేవాసమితి వ్యవస్థాపకులు మాగుంట శరత్‌చంద్రారెడ్డి(చందు) ఈ చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ 'మన ఊరు మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా ముదురుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని ఈ దారినపోయే ప్రజలు ఇబ్బంది పడకుండా వుండేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసామన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు మజ్జిగ, మంచినీళ్ళతో పాటు పుచ్చకాయలు కూడా పంపిణీ చేసారు.

ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు లేకిన్‌రెడ్డి, సిహెచ్ మహేష్, కె.అశోక్, సాయిబాబా, మందా బాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో 'గుండెపోటు' పట్ల అవగాహన



మాత్రల కిట్‌ల పంపిణీ కార్యక్రమంలో మైథిలి మనోహర్‌రెడ్డి, బయ్యా వాసు, ఎన్.బలరామయ్యనాయుడు, పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి, ఎం.వి.సుబ్బారెడ్డి

నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న గుండెపోటు పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆకస్మిక ఛాతీనొప్పి, ఛాతీ నుంచి ఎడమచేతికి నొప్పి సోకడం, ఛాతీ వెనుక నొప్పి, అకారణంగా చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఆకస్మిక కనిపించిన వెంటనే తగు ముందుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక లక్షణాలు కనిపించిన వెంటనే తీసుకోవాల్సిన మందులను గురించి వివరించారు. గుండెపోటు వచ్చిందన్న అనుమానం వస్తే ఎలాంటి అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి తగు చికిత్సలు తీసుకోవాలని సూచించారు. గుండెపోటుకు సంబంధించి ప్రాథమిక లక్షణాలు గమనించిన వెంటనే తీసుకోవాల్సిన మందులను, ప్రముఖ గుండెవ్యాధి నిపుణులు సి.ఎస్.శ్రీనివాసరాజు సూచనమేరకు ఆయా మందులను పంపిణీ చేశారు. స్థానిక విఆర్‌సి సెంటర్‌లోని శుభమస్తు షాపింగ్ మాల్ వారి సౌజన్యంతో ఉచితంగా ఆ మందులను వాకర్స్ మిత్రులందరికీ అందజేశారు. ప్రతి ఇంటిలో తప్పక ఉంచుకోవాల్సిన మాత్రల కిట్‌ను 600 మందికి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 203 వాకర్స్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.వి సుబ్బారెడ్డి, వాకర్స్ మాజీ గవర్నర్ మైథిలీ మనోహర్‌రెడ్డి, డిప్యూటీ గవర్నర్ పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా వాసు, కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి కొండూరు సుబ్బారావు, జి.వి.కృష్ణయ్య, కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బాలకృష్ణకు రంగనాథుని ప్రసాదం

ఈ నెల 22వ తేదీ చిలకలూరిపేటలో జరిగిన 'సింహ' శత దినోత్సవ వేడుకకు హాజరైన సినీ నటుడు నందమూరి బాలకృష్ణకు నెల్లూరు రంగనాథస్వామి దేవస్థానం ఛైర్మెన్ మంచికంటి సుధాకర్ రావు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ నెల 21న ముగిసిన శ్రీ భగవద్రామానుజుల అవతారోత్సవాల సందర్భంగా ప్రత్యేక యాగాల నిర్వహణలో వినియోగించిన కలశం, ప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

# వాయిదాపడ్డ తపాలా ఉద్యోగ సంఘం ఎన్నికలు

ఈ నెల 22న జరగాల్సిన తంతి తపాలా ఉద్యోగుల సహకార పరపతి సంఘం ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఇంకొద్ది గంటల్లో ఎలక్షన్ జరగనుండనగా ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు ఈ ఎన్నికలపై స్టే ఇచ్చింది. అంతిమతీర్పు విచారణ పూర్తయ్యేంత వరకు ఎన్నికలు నిలిపివేయాలని ఆదేశాలు జారీచేసింది. గత పాలకవర్గంలో జరిగిన అవకతవకలు, అవినీతిపై కొందరు సభ్యులు కోర్టును ఆశ్రయించడం మూలంగా ఈ ఎన్నికలు వాయిదా పడ్డట్లు తెలుస్తోంది.

# అట్టహాసంగా రెయిన్‌బో కలర్స్



నెల్లూరు రూరల్ మండలం కలివెలపాలెంలోని రెయిన్‌బో సీనియర్ స్కూల్ వార్షికోత్సవం కలర్స్ - 2018 వేడుకలు ఈ నెల 24వ తేదీన నెల్లూరులోని అనిల్‌గార్డెన్స్‌లో కనులపండువగా జరిగాయి. విద్యార్థులు వెల్‌కమ్ నృత్యంతో 'కలర్స్-2018'ను ఆరంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు లైఫ్ ఆఫ్ బుద్ధ, తబలా వాయిద్యం, అస్సాం, మిజోరం, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, త్రిపుర, సిక్కిం, మణిపూర్ వంటి ప్రాంతాల శైలి నృత్యాలతో ఆహూతులను అలరింపజేశారు. స్కూల్ డైరెక్టర్ శ్రీమతి పద్మా సుబ్రహ్మణ్యం, రెయిన్‌బో సిబిఎస్ఇ స్కూల్ ప్రిన్సిపాల్ రామగిరి విద్యాసాగర్, మాగుంట లే అవుట్ స్కూల్ ప్రిన్సిపాల్ అరుణా స్వయంప్రభ, ప్రైమరీ స్కూల్ ఇన్‌ఛార్జ్ ఫాతిమాఖాన్, కొరియోగ్రాఫర్స్ సురేష్, అనూరాధ, నందన్ పాల్గొన్నారు.



# ఖాళీ ప్లాట్లు.. జనం పాట్లు

- ఇళ్ళ మధ్యలో..'మురుగుడు గుంతలు'
- దోమల పుట్టిళ్ళుగా ఖాళీస్థలాలు

*ఖాళీ స్థలాలను..ప్లాట్లను ఏళ్ళ తరబడిగా పట్టించుకోకుండా..అలా ఖాళీగానే వదిలేయడం వల్ల ఇరుగుపొరుగు జనానికి ఇక్కట్లు మొదలవుతున్నాయి. పిచ్చిమొక్కలు, ముళ్ళ పొదలు పెరిగిపోవడం, దోమలకు, కుక్కలు..పందులకు, విషసర్పాలకు ఆవాసం కావడం అనేకచోట్ల జరుగుతూ ఉంది. దీంతో నగరమంతా దుర్గంధంతో గబ్బుకొట్టి పోతోంది. ఇళ్ళమధ్యల ప్లాట్లతోపాటు, పరిసరాలన్నీ కుళ్ళు కంపుకొడుతున్నాయి.*

నెల్లూరు నగరంలోని అనేక వీధులు, అనేక ప్రాంతాల్లో ఇళ్ళకోసం తీసుకున్న స్థలాలు, లేదా ప్లాట్లు కనిపిస్తుంటాయి. ఆ స్థలాల్లో ఇళ్ళు కట్టుకునేందుకు కారణాంతరాల వల్ల స్థల యజమానులకు వెసులుబాటు లేకపోవడంతో అనేకచోట్ల అవి ఎంతోకాలంగా ఖాళీగానే ఉంటున్నాయి. అక్కడ ఇళ్ళు కట్టుకునేందుకు తగు అర్థిక వసతులు లేకపోవడం వల్లనో, లేదా మంచి ధర వస్తే విక్రయించుకోవచ్చనో ఇలా రకరకాల కారణాల వల్ల వాటిని అలా వదిలేస్తుండవచ్చు. అయితే, ఆ ప్లాట్లను చాలామంది అలా ఖాళీగానే వదిలేయడం వల్ల, సంవత్సరాలు గడుస్తున్నా వాటి అతీగతీ పట్టించుకోకపోవడం వల్ల ఇరుగుపొరుగు వారికి సమస్యలు వస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఇదే సమస్య చాలాచోట్ల ఉంది. ముఖ్యంగా నెల్లూరు నగరంలో ఎంతోకాలంగా తిష్టవేసుకుని కూర్చుని ఉన్న పెద్ద సమస్య ఇది.

## ఎక్కడ చూసినా గబ్బు గబ్బు!

ఈ ఖాళీ ప్లాట్లు అనబడు స్థలాల్లో కొన్ని చోట్ల సంబంధిత యజమానులు మాత్రం శ్రద్ధ తీసుకుని తమ స్థలాల్లోకి పశువులు, పందులు రాకుండా గేట్లు పెట్టడం, మంచి పూలచెట్లు నాటి వాటిని అందంగా తీర్చిదిద్దుకోవడం వంటి పనులు చేస్తుండడం అభినందనీయం. అంతా గబ్బుగబ్బుగా మారి, మురుగుదిబ్బల్లా ఉన్న ప్లాట్లలోకి అడుగుపెట్టాలంటేనే భయం. దూరం నుంచి చూసి ముక్కు మూసుకోవాల్సిందే తప్ప లోపలికి వెళ్ళే దారే ఉండదు. మురుగుగుంటల్లా మారిన ప్లాట్లు.. దోమలకు ఇళ్ళుగా మారిపోయాయి. ఈ ఖాళీస్థలాలు లేదా ప్లాట్లు వాటికి భలే దొరికాయి. ఈగలు దోమలతో పాటు, పశువులు, పందులు, కుక్కలు..ఎలుకలు, చుంచులు.. నలికీసులు.. ఇలా నానారకాల కీటక జంతుజాలమంతా ఆ ప్లాట్లలో యదేచ్ఛగా విహరిస్తుంటాయి. అక్కడే సందుచూసుకుని రకరకాల పాములు కూడా కాపురం పెడుతున్నాయి. కట్లపాములు, నాగుపాములు, జెర్రిపోతులు వంటి విషసర్పాలు కూడా జొరబడుతున్నాయి. వీటన్నిటికీ మన నిర్లక్ష్యమే మంచి ఆవాసం కల్గిస్తోందని చెప్పవచ్చు.

## ఖాళీ ప్లాట్లా!..డంపింగ్‌యార్డ్‌లా?!....

ఈ ఖాళీప్లాట్లు రానురాను చెత్తదిబ్బలుగా మారుతున్నాయి. ఖాళీప్లాటు కనిపిస్తే చాలు..ఇక ఇరుగుపొరుగు చెత్తకు కొదవుండదు. కొన్నిచోట్ల ఆ చుట్టుపక్కల ఉన్న వారు కూడా తమ ఇళ్ళలోని చెత్తనంతా శుభ్రంగా ఊడ్చి, ఖాళీగా ఉంది కదా.. అని ఇతరులకు చెందిన ఈ ఖాళీప్లాట్లలోనే కుమ్మరించేస్తుంటారు. దీంతో అలా ఆ ఖాళీ ప్లాట్లు జనానికి అనధికారిక డంపింగ్‌యార్డుల్లా మారిపోతున్నాయి.

## ఆ చెత్త... తిరిగి మన నెత్తిమీదికే...

కొంతమంది సందు దొరికింది కదా అని..తమ ఇళ్ళలోని చెత్తాచెదారాన్ని, పనికిరాని ఆహారపదార్థాలు వగైరాలన్నిటినీ భద్రంగా ప్లాస్టిక్‌కవర్లలో చుట్టి మూటగట్టి ఖాళీప్లాట్లలోకి విసిరేస్తుంటారు. పెద్దపెద్ద అపార్ట్‌మెంట్‌ల మధ్యలో ఓ ఖాళీస్థలం దొరికితే చాలు, జనానికి పండగ. ఇంట్లో ఉన్న చెత్తనంతా హాయిగా అక్కడ కుమ్మరించేస్తుంటారు. ఆ చెత్తంతా రోజూ కుప్పలు తెప్పలుగా ఆ ఖాళీస్థలాల్లో పడి, మురిగిపోయి కుళ్ళు కంపు కొడుతుంటుంది. చివరికి ఆ మురుగు గబ్బునంతా పీల్చాల్సింది ఆ చుట్టుపక్కల ఉన్న జనమే కదా?.. మన ఇంట్లో చెత్తనంతా ఖాళీప్లాట్లలో పోసేస్తే..మన చెత్తను మన నెత్తిన మనమే వేసుకున్నట్లేనని మనం అర్థం చేసుకోవాలి.

## మీ ప్లాట్లు బాగుంటే.. మేము బాగున్నట్లే...

ప్లాట్ల యజమానులు కూడా అవి 'మా స్థలాలు..మా ఇష్టం' అనే ధోరణితో కాక, ప్రజారోగ్యం కోసం అప్పుడప్పుడూ వాటి బాగోగులను పట్టించుకోవాలి. ఎందుకంటే ఆ ప్లాట్లు బాగుంటే మన ఆరోగ్యం బాగున్నట్లే. మీ ప్లాట్ల పరిశుభ్రతే..మా ఆరోగ్య భాగ్యం అంటున్నారు జనం. అందువల్ల మన చుట్టూ ఉన్న పరిసరాలు కాలుష్యానికి గురికాకుండా కాపాడుకోవాలి. కనుక, మీరూ ఒకసారి మీ ఖాళీప్లాట్లు, స్థలాలు ఎలా ఉన్నాయో ఒకసారి చూసుకుంటూ... మీ ఆలోచనల మేరకే వాటిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుకొని పరిసరాలను-పరిశుభ్రతను పరిరక్షిస్తారని ఆశిద్దాం!...

# చదువుల సరస్వతికి.. విద్యారత్నం చేయూత

ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాలలో బైపిసి విభాగంలో 990 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచిన తన శిష్యురాలు నారపనేని లక్ష్మీకీర్తికి ఆమె ఉన్నత చదువులను దృష్టిలో పెట్టుకుని ఆమె గురువు, రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం 3లక్షల 10వేల రూపాయల నగదు ప్రోత్సాహాన్ని అందించారు. ఈ నెల 21వ తేదీన నెల్లూరు హరనాథపురంలోని రత్నం మెడికల్ అకాడమీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన లక్ష్మీకీర్తి తల్లి శ్వేతకి ఈ నగదు చెక్కును అందజేశారు.



లక్ష్మీకీర్తికి విరాళం చెక్కును అందజేస్తున్న కె.వి.రత్నం

ఈ సందర్భంగా రత్నం ఆ విద్యార్థినిని అభినందిస్తూ తండ్రి లేకపోయినప్పటికి తల్లి అందించిన సహకారంతో రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా రాణించిందని, భవిష్యత్‌లో ఆమె ఉన్నత చదువులకు ఇబ్బంది వుండకూడదనే ఉద్దేశ్యంతోనే ఈ ఆర్థిక సాయాన్ని అందించినట్లు తెలిపారు. 1980లోనూ 1985లోనూ ఇంటర్‌లో ఇలాగే రాష్ట్ర టాపర్లుగా నిలిచిన పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూతనిచ్చామన్నారు. లక్ష్మీకీర్తి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అందుకుని నెల్లూరు పేరును నిలబెట్టాలని ఆయన ఆకాంక్షించారు.

# క్రైస్తవుల అభ్యున్నతికి కృషి

## - రాష్ట్ర వ్యవసాయమంత్రి సోమిరెడ్డి

క్రైస్తవుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎంతో కృషి జరుగుతోందని, నెల్లూరు నగర పరిధిలో క్రైస్తవ కల్యాణ మండపం ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు పంపితే ముఖ్యమంత్రితో చర్చించి 5 కోట్ల రూపాయలు మంజూరు చేయించడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 22వ తేది సాయంత్రం అల్లీపురంలోని మంగలిదిబ్బ వద్ద 5 ఎకరాల విస్తీర్ణంలో క్రైస్తవ సమైఖ్య సమాధుల తోట శిలాఫలకావిష్కరణ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కుల మత వర్గాల భేదాలు లేకుండా ప్రజలందరి సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోందన్నారు. స్మశాన వాటికలను పరిశుభ్రంగా అందంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. మంగలిదిబ్బ వద్ద ఏర్పాటు చేయనున్న స్మశానవాటికపై పలు అంతరాయాలు ఏర్పడినప్పటికీ వాటిని అధిగమించామన్నారు. స్మశాన వాటికలను అన్ని వసతులతో సుందరంగా తీర్చిదిద్దుతుండడం వల్ల అవాంతరాలన్నీ తొలగిపోతున్నాయన్నారు. స్మశానవాటికలను అందంగా రూపుదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతగా 10లక్షల రూపాయలు మంజూరు చేసిందన్నారు. అంబేద్కర్ భవనం ఏర్పాటుకై 5కోట్ల రూపాయలు మంజూరు చేయడంతో పాటు గూడూరు, సూళ్ళూరుపేట తదితర ప్రాంతాల్లో అంబేద్కర్ భవన్‌లు ఏర్పాటు కోసం టెండర్లు పిలవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ ఆలీంబాషా, కార్పొరేటర్లు రామమూర్తి, షంషుద్దీన్, నూనె మల్లికార్జునయాదవ్, బిషప్ ఎం.డి ప్రకాశం, ఫాదర్ జోసఫ్, నరేంద్ర, డా. ఎలీషాకుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్రైస్తవ సమైఖ్య సమాధుల తోట శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

# దిష్టిబొమ్మ ఘటనలో ముష్టియుద్ధం



గొడవపడుతున్న టీడీపీ, బీజేపీ కార్యకర్తలు

నెల్లూరులో టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తల మధ్య అగ్గిరాజుకుంది. ఒకరిపై ఒకరు దాడులకు దిగే పరిస్థితులొచ్చాయి. 20వ తేదీ విజయవాడలో జరిగిన ధర్మపోరాట దీక్షలో ప్రధాని నరేంద్ర మోడీపై ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం జరిగింది. దీనిని నిరసిస్తూ 21వ తేదీన బీజేపీ కార్యకర్తలు నెల్లూరు, గాంధీబొమ్మ సెంటర్‌లో ధర్నా నిర్వహించి అనంతరం బాలకృష్ణ దిష్టిబొమ్మను తగలబెట్టే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ప్రత్యేకహోదా ఇవ్వకుండా కేంద్రం మోసం చేసిందని నిరసిస్తూ నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేయడానికి అక్కడకు చేరుకున్నారు. అదే సమయంలో బీజేపీ కార్యకర్తలు తమ ఆరాధ్యదైవం బాలకృష్ణ దిష్టిబొమ్మను తగులబెడుతుండడాన్ని చూసి వాళ్ళు తట్టుకోలేకపోయారు. ఒకర్నొకరు నెట్టుకుంటూ గొడవకు దిగారు. ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. ఇరు పార్టీలలో కొందరికి గాయాలయ్యాయి. చొక్కాలు చిరిగాయి. కొద్ది నిముషాల్లోనే అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో నగరంలోని అందరు సి.ఐలు, ఎస్.ఐలు అక్కడకు చేరుకుని అందరినీ తరిమేసి పరిస్థితిని అదుపుచేసారు. ఈ సంఘటన తర్వాత టీడీపీ, బీజేపీ నాయకుల మధ్య మాటల యుద్ధం మొదలయ్యింది. నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బీజేపీ ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డిలు ఒకరికొకరు సవాళ్ళు విసురుకుంటూ కయ్యానికి కాలు దువ్వుతున్నారు.

## కల్యాణ వైభవం...!



గూడూరు సిరామిక్ కాలేజీరోడ్డు, గణేష్‌నగర్ వాస్తవ్యులు నీలం రాజారెడ్డి - అనసూయమ్మల కుమారుడు **వెంకట చైతన్య కుమార్‌రెడ్డి - చందన** (చిత్తూరుజిల్లా, పల్లమాల గ్రామ వాస్తవ్యులు ఉచ్చూరు రవిరెడ్డి - సుపర్ణల కుమార్తె)ల కల్యాణం శ్రీకాళహస్తిలోని ఎన్.వి.ఎస్ ఫంక్షన్‌హాలులో ఈ నెల 19వ తేదీన వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# అత్యాచార నిందితుడికి కఠినశిక్ష తప్పదు

### - డిఎస్పీ వి.ఎస్.రాంబాబు




ఆరేళ్ళ చిన్నారిపై అత్యాచారం జరగడం ఎంతో బాధాకరమని, నిందితుడిని కఠినంగా శిక్షించే దిశగా చట్టం పని చేస్తుందని గూడూరు డిఎస్పీ వి.ఎస్.రాంబాబు తెలిపారు. స్థానిక డిఎస్పీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఘటనను హీనస్ క్రైం కింద తీసుకుని డిఎస్పీ స్థాయి అధికారే దర్యాప్తు చేపట్టాల్సి వుందని, తానే ఈ దర్యాప్తును చేపడుతున్నానన్నారు. ఆదివారం చెన్నూరులో చిన్నారి తల్లిదండ్రులను, బంధువులను విచారించామన్నారు. ఘటన జరిగిన 24గంటల్లోపే నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడి సర్టిఫికేట్ల ఆధారంగా మైనర్(17 సంవత్సరాల 6 నెలలు) కావడంతో హీనస్ క్రైంగా తీసుకుని జూనైల్ కోర్టులో నిందితుడిని హాజరుపరుస్తున్నామన్నారు. ఈ నేరంలో ఫోక్సో యాక్టు అమలు అవుతుందని, ఇది చాలా కఠినమైందన్నారు. నిందితుడు బి.టెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడన్నారు. భవిష్యత్తులో ఇలాంటి నేరాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో రూరల్ సి.ఐ అక్కేశ్వరరావు, గూడూరు పట్టణ, రెండో పట్టణ, రూరల్ ఎస్సైలు శేఖర్‌బాబు, హుస్సేన్ బాషా, బాబీలు ఉన్నారు. కాగా చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన మృగాడిని కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో అరుణ్‌బాబు, డిఎస్పీ విఎస్ రాంబాబు తెలిపారు. ఆదివారం చెన్నూరులోని బాధిత చిన్నారి తల్లిదండ్రులతో వారు మాట్లాడుతూ నిందితుడికి శిక్షపడేలా చర్యలు తీసుకోవడమే కాకుండా, జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతామన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

### పారిచెర్లవారిపాళెం పాఠశాలకు

# వైజేపీ లయన్స్ క్లబ్ సహకారం



వైజేపీ లయన్స్ మాజీ అధ్యక్షుడు వరిదిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు, పాఠశాల సిబ్బంది

వైజేపీ లయన్స్ క్లబ్ గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందని క్లబ్ మాజీ అధ్యక్షుడు వరిదిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. తన స్వగ్రామమైన పారిచెర్లవారిపాళెంలోని ఉన్నత పాఠశాలకు గత ఏడాది 26 బెంచీలను అందివ్వడం జరిగిందన్నారు. ఈ ఏడాది గ్రామంలోని కొంతమంది దాతలను సంప్రదించి వారి సహకారంతో ఇటీవల క్లబ్ ఆధ్వర్యంలో 16బెంచీలను అందించారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరెడ్డిని పాఠశాల సిబ్బంది, క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షురాలు మంజులాదేవి, ఎన్.వెంకటసుబ్బయ్య, క్లబ్ కార్యదర్శి ఎం.మురళీరాజు, యల్లంటి వేణురెడ్డి, నెలబల్లి రామచంద్రారెడ్డి, జయరామిరెడ్డి, హెచ్‌ఎం ఎ.సురేంద్ర మోహన్, ఉపాధ్యాయులు, శివరామిరెడ్డి, వి.వి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### గూడూరు తహశీల్దార్‌గా

## బాధ్యతలు చేపట్టిన వరకుమార్



గూడూరు మండల తహశీల్దార్‌గా ఎస్.వరకుమార్ ఇటీవల పదవీ బాధ్యతలను చేపట్టారు. గూడూరులో పనిచేస్తున్న వెంకటేశ్వర్లు బదిలీపై కావలికి వెళ్లారు. నెల్లూరులో పని చేస్తున్న వరకుమార్ బదిలీపై గూడూరు తహశీల్దార్‌గా నియమితులయ్యారు. ఈ క్రమంలో బాధ్యతలు చేపట్టిన వరకుమార్‌ను రెవెన్యూ అధికారులు పరిచయం చేసుకున్నారు. గతంలో ఇక్కడ తహశీల్దార్‌గా పని చేయడంతో అందరూ ఆయనకు సుపరిచితులే.

## జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు




మాట్లాడుతున్న డిప్యూటి ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎన్.శివరామ్‌ప్రసాద్

ఈ నెల 24వ తేదీ గూడూరు ద్వారకా ఫంక్షన్‌హాల్‌లో 29వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో నెల్లూరు డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఎన్.శివరామ్‌ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్టీవో బి.చందర్, డిఎస్పీ వి.ఎస్.రాంబాబు, ఎమ్‌విఐ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.సీతారామిరెడ్డి, ఎమ్.వి.ఐ జాకీర్, విజయప్రకాష్, ఎఎమ్‌విఐ కరుణాకర్, సౌజన్య, ఎవో మదని, సిబ్బంది రామ్మోహన్, శ్రీనివాసులురావు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

### మహ్మదీయ వెల్ఫేర్ నెట్‌వర్క్ సంఘం ఆధ్వర్యంలో

# 29న ఉచిత ఖత్నాలు



మాట్లాడుతున్న మహ్మదీయ వెల్ఫేర్ నెట్‌వర్క్ గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్

గూడూరు పట్టణంలోని షాదీ మంజిల్‌లో మహ్మదీయ వెల్ఫేర్ నెట్‌వర్క్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన పేద ముస్లిం బాలలకు ఉచిత ఖత్నాలు కార్యక్రమం నిర్వహించనున్నామని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ తెలిపారు. గూడూరు పట్టణంలోని షాదీమంజిల్‌లో ఆదివారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖత్నాలు కోవూరు వైద్యులు షేక్ మహబూబ్ భాషా చేస్తారని, ఖత్నాలు చేయించుకున్న బాలురకు గూడూరు లలితా మెడికల్స్ వారు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. బాలికలపై అఘాయిత్యాల ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ అధ్యక్షుడు అబ్దుల్ రహీం, గౌరవ సలహాదారుడు ఎండీ అన్వర్, ప్రతినిధులు ఇస్మాయిల్, యూసుఫ్, రఫీ, జిలానీ, గౌస్‌భాషా, రహంతుల్లా, ఉమర్, మున్వర్, ఔరంగ్, నయిముద్దీన్, మహబూబ్ బాషా, ఎంఎఫ్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మగ్దూమ్ తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 24న తమ నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ అల్పాహార విందుకు హాజరైన జిల్లా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌లను గజమాలతో సత్కరిస్తున్న గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, శివకుమార్‌రెడ్డి, ఆర్డీఓ అరుణ్‌కుమార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు



ఇటీవల నవ్యాంధ్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టిన ధర్మపోరాట దీక్షకు మద్దతుగా గూడూరులో సామూహిక ఉపవాస దీక్షను చేపట్టిన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పెంచలకోన నరసింహస్వామి ఆలయ ఛైర్మెన్ తానంకి నానాజీ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు, న్యాయవాదులు, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల అధినేతలు, అన్ని కుల సంఘాల నేతలు.



మిత్రమా...

# నవ్వుల ప్రతి రూపమా...

నవ్వావు... నవ్వించావు...
నవ్వులను ప్రోత్సహించావు...
నవ్వుతూ బ్రతకమన్నావు...
నవ్వుతూ నడవమన్నావు...
నవ్వుతూ ఎదగమన్నావు...
ఇలా మరణించి ఏడిపిస్తావనుకోలేదయ్యా!

నా నవ్వుల 'గల్పిక'కు ఆయువు నీవే, ప్రాణవాయువు నీవే...
హీరోయిజం నీదే... విలనిజమూ నీదే...
నీ మరణంతో నా కలం కూడా కన్నీరుమున్నీరైంది...
నీవు లేవన్న వార్త విని దాని గుండె మూగబోయింది.

గలగలా నవ్వులు చిందించే నా కలం...
విలవిలా.. ఏడ్చి ఏడ్చి... ఇంకిపోయింది.

నువ్వు లేని, నీ ఊసు లేని నా 'గల్పిక'
హీరో లేని సినిమా లాంటిదే!

స్టైల్ ఆఫ్ సింహపురికి..
అశ్రునయనాలతో...

శ్రీను గల్పిక

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ప్రభుత్వ కార్యాలలో పనులు వాయిదా పడవచ్చును. ప్రయాణాల విషయంలో ముందు వెనుకలు ఆలోచిస్తారు. స్థిరాస్తులపై ఆదాయం, షేర్ల వ్యాపారాలలో కొద్దిపాటి లాభాలుంటాయి. విద్యా ప్రగతి బాగుంటుంది. ఉద్యోగార్థులకు చిన్న అవకాశాలుంటాయి. అనుకున్న పనులు శ్రమతో సాగిస్తారు. వృత్తి ఉద్యోగ బాధ్యతలలో ఇబ్బందులు అధిగమిస్తారు. అనుకోని ఖర్చులు పైనబడగలవు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తిపరంగా రాణిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరకవచ్చును. అనుకున్న పనులు సమర్ధవంతంగా జరుపుతున్నా అప్పుడప్పుడు టెన్షన్ పడుతుంటారు. మీ వ్యక్తిత్వానికి మంచి విలువ గౌరవముంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఆర్థిక పరిస్థితి బాగుంటుంది. ఆదాయం సంతృప్తికరం. శరీరానికి గాయాలు తగలవచ్చును.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఉద్యోగ ప్రయత్నాలలో ఇంటర్వ్యూ అవకాశాలు లభించగలవు. విద్యార్థులకు చదువు శ్రద్ధ తగ్గి, వ్యాపకాలు పెరుగుతాయి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. వ్యవహారాలను జాగ్రత్తగా నడపటానికి, మాటతీరు, తొందరపాటు తగ్గించుకొనడం మంచిది. వ్యాపార వర్గాలకు సామాన్య ఆదాయం ఉంటుంది. కొన్ని మంచి అవకాశాలు వ్యాపార వర్గాలకు చేజారిపోవచ్చును.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

సహచరులను ఆదుకొనడం, బంధుముఖ్యుల అనారోగ్య వార్తలు వినడం జరుగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలలోనున్న వారికి చిరు అవకాశాలు దొరకగలవు. భూములు, ఇండ్ల స్థలాలు కొనుగోలు ఆలోచన, ప్రయత్నాలుంటాయి. ముఖ్యమైన పత్రాలు, వస్తువులు జాగ్రత్త పరచుకొనాలి. విద్యార్థులు చదువుపై ఎక్కువ దృష్టి పెడతారు. షేర్లు స్వల్ప లాభాలనందిస్తాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యాపార భాగస్వామ్యాలు దొరకడం జరుగుతుంది. పనులందు టెన్షన్ ఉంటుంది. ఉద్యోగులు సమర్ధవంతంగా వ్యవహరిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరుకుతాయి. అనవసర వ్యవహారాలలోకి లాగడానికి ఇతరులు ప్రయత్నిస్తారు. కాబట్టి జాగ్రత్త పడండి. విద్యా ప్రగతి బాగుంటుంది. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలు పెరిగి తీరక లేకుండా శ్రమపడతారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

బిడ్డల ఉద్యోగ వివాహాల ప్రయత్నాలు ఫలించగలవు. అనుకోని ప్రయాణాలు, ప్రముఖులను, ఆత్మీయులను కలుసుకొనడం జరుగుతుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. సమావేశాలలో మీ సూచనలకు ఆమోదం లభిస్తుంది. ఆర్థికావకాశాలకు ఆఫర్లు లభిస్తాయి. ఆస్తి వ్యవహారాలు, బాకీ వ్యవహారాలు ఒక సర్దుబాటుకు వస్తాయి. షేర్లు లాభాలనిస్తాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 27.4.2018 నుండి
తేది. 3.5.2018 వరకు

ఈ వారం మీనంలో బుధుడు, మేషంలో రవి, వృషభంలో శుక్రుడు, కర్కాటకంలో రాహువు, తులలో గురువు, ధనుస్సులో శనికుజులు, 2తేది మకరంలో కుజుడు మరియు కేతువు, కన్య తుల వృశ్చిక రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము : ముహూర్తములు

తేది 27 శుక్రవారం రాత్రి 3.48 నుండి 5.30లోగా గృహారంభ, గృహప్రవేశ వివాహములు.

### వైశాఖ మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 27 | శుక్ర | ద్వాదశి | ఉ॥ గం.7.58వ॥ |
| తేది. 28 | శని | త్రయోదశి | ఉ॥ గం.6.45వ॥ |
| తేది. 29 | ఆది | చతుర్దశి | ఉ॥ గం.5.57వ॥ |
| | పిదప | పూర్ణిమ | రా॥ గం.5.50వ॥ |

### వైశాఖ మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 30 | సోమ | పాడ్యమి | రా॥ గం.5.57వ॥ |
| తేది. 1 | మంగళ | విదియ | పూర్తిగ |
| తేది. 2 | బుధ | విదియ | ఉ॥ గం.6.40వ॥ |
| తేది. 3 | గురు | తదియ | ఉ॥ గం.7.54వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కుటుంబసభ్యులతో సామరస్య ధోరణిలో నడుచుకొనండి. సోదరీ సోదర వర్గాలకు మంచి జరుగుతుంది. వర్కర్లతో యజమానులకు సమస్యలు ఏర్పడవచ్చును. అనుకోని ఆదాయం వస్తు ధన రూపంలో లభించగలదు. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి చిన్న అవకాశాలు దొరకగలవు. అనవసర వివాదాలలో తలదూర్చకుండా జాగ్రత్త పడండి. వ్యాపార వర్గాలకు ఆదాయం పెరుగుతుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

పూజా కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. జీవిత భాగస్వామి సలహాలు పాటించండి, మేలు జరుగుతుంది. ఆరోగ్యం స్వల్పంగా లోపించి బాధపడతారు. ఉద్యోగులకు స్థానమార్పులు, ప్రమోషన్లు వంటివి వస్తాయి. విద్యార్థులకు మంచి ప్రగతి ఉంటుంది. ప్రముఖులతో పరిచయాలు, ఎదుటి వారి సలహాల వల్ల మేలు జరగడం ఉంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది మరియు అధికారుల అభీష్టాలకు అనుగుణంగా నడుచుకొనవలసి వస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. కోర్టు కేసులు, ఆస్తి వ్యవహారాలు వాయిదా పడతాయి. సాహిత్య, కళా, క్రీడా రంగాల వారికి అవకాశాలు లభిస్తాయి. విద్యా ప్రగతి బాగుంటుంది. ఎదుటి వారి ప్రలోభాలకు, ఆశలకు లొంగవద్దు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

అధికారులకు ప్రమోషన్లు, స్థాన చలనం ఉంటుంది. స్థిరాస్తులు, షేర్లపై లాభాలుంటాయి. శుభ కార్యాలు నిర్ణయం చేస్తారు. దూర ప్రయాణాలుంటాయి. ఓర్పు, లౌక్యంతో పనులు సాధించగలరు. సోదర వర్గానికి మేలు జరుగుతుంది. చిన్న విషయాలపై ఇంట్లో వారితో తగాదాలు రావచ్చును. ఆరోగ్యం బాగుంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కాంట్రాక్టులు, లీజులు పొడిగింపబడటం, ప్రభుత్వ అనుమతులు దొరకడం జరుగుతుంది. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. బంధుమిత్ర వర్గాలు యధోచిత సహాయం అందిస్తారు. అధికారులకు స్థానమార్పు, ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకడం జరుగుతుంది. ఆరోగ్యం బాగుంటుంది. క్రొత్త వస్తువులు కొనడం, అనుకోని ప్రయాణాలుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

దూర ప్రయాణాలుంటాయి. శరీర శ్రమ, విశ్రాంతి లేకపోవడం వల్ల ఆరోగ్యం సరిగా వుండదు. ఉద్యోగావకాశాలు లభించగలవు. ఉద్యోగులకు విధి నిర్వహణలో సమర్థత, అధికారులతో చనువు లభిస్తుంది. విలువైన వస్తువులు, గృహోపకరణాలు కొంటారు. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. విద్యా ప్రగతి బాగుంటుంది. ఆర్థిక వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు వద్దు.





వివేకా పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



అశేష అభిమాన సందోహం మధ్య ఆనం వివేకా అంతిమయాత్ర

# స్వర్గపురికి... స్టైల్ ఆఫ్ సింహపురి

2018 ఏప్రిల్ 25వ తేదీ... ఒక చరిత్ర కన్ను మూసిన రోజు... నెల్లూరుజిల్లా రాజకీయ చరిత్రలో ఒక అధ్యాయం ముగిసినరోజు. రాష్ట్ర రాజకీయ వినీలాకాశంలో నుండి ఒక ధృవతార నేలరాలిన రోజు. వేలాదిమంది పేదల ఆశలు అవిరైన రోజు. అభిమానుల ఆక్రందనలు మిన్నంటిన రోజు. బడుగు వర్గాల ప్రజల గుండెలు పగిలినరోజు. స్టైల్ ఆఫ్ సింహపురి, మాజీశాసనసభ్యులు ఆనం వివేకా ఈ నేలను, ఈ నెల్లూరును, ఈ పెన్న నీళ్ళను, ఈ రంగడి గుడిని, బారాషహీద్ దర్గాను, తనను అభిమానించే పేదలను, బడుగులను, మైనార్టీలను, దళితులను, పిల్లలను, పెద్దలను వదిలి తనకిష్టమైన సర్వేశ్వరుని సన్నిధికి పయనమైనరోజు. అందుకే నెల్లూరంతా ఈ విషాదం... నెల్లూరీయులందరిలోనూ విచారం. సింహపురి గడ్డ ముద్దుబిడ్డ, నెల్లూరు లెజండ్ ఆనం వివేకానందరెడ్డి ఇక లేడనే వార్తతోనే నెల్లూరంతా ఈ విషాదం... నగరమంతా శోకమయం.

తన నలభై ఏళ్ళ రాజకీయ చరిత్రలో ఎందరో యోధానుయోధులను ఢీకొట్టి మట్టి కరిపించిన ఆనం వివేకా వ్యక్తిగత జీవితంలో మాత్రం తనపై యుద్ధానికి వచ్చిన మృత్యువును మాత్రం ప్రేమతో కౌగిలించుకున్నాడు. దాని వశమయ్యాడు. దానితో కలిసే కైలాసానికి పయనించాడు.

గత కొన్నేళ్ళుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడు తున్న ఆయన ఏప్రిల్ 25వ తేదీ ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచాడు. ఆయన వయసు 67సంవత్స రాలు. రాజకీయాలలో ఉపరాష్ట్రపతి యం.వెంకయ్య నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మాజీముఖ్యమంత్రి దివంగత నేత వై.యస్.రాజ శేఖరరెడ్డిలకు సమకాలీకుడైన వివేకా 1950 డిసెంబర్ 23వ తేదీన మాజీమంత్రి ఆనం వెంకట రెడ్డి, వెంకట రమణమ్మ దంపతులకు మొదటి సంతానంగా జన్మించాడు. విద్యాభ్యాసం అంతా నెల్లూరులోనే జరిగింది. విఆర్ కళాశాలలో బి.కాం పూర్తి చేసాడు. తన పెద్దనాన్న స్వర్గీయ ఏ.సి.సుబ్బా రెడ్డి, తండ్రి ఆనం వెంకటరెడ్డిల శిక్షణలో రాజకీయ ఓనమాలు నేర్చుకున్నాడు.

## ఇదీ ఆయన రాజకీయ ప్రస్థానం

1980లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజకీయంగా తొలిఅడుగులు వేసాడు. 1982లో జిల్లా ల్యాండ్ మర్కెంటైల్ బ్యాంక్ ఛైర్మెన్‌గా పని చేశాడు. 1987లో మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలి చాడు. అప్పుడే మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ అయ్యాడు. 1988లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడిగా కొంత కాలం పనిచేశాడు. 1992లో శ్రీ వేణు గోపాలస్వామి కాలేజీ కరస్పాండెంట్‌గా బాధ్యతలు చేపట్టాడు. 1993లో విఆర్ కళాశాల కమిటీకి జరిగిన ఎన్నికల్లో కరస్పాండెంట్‌గా ఎన్నికై ఇటీవల వరకు ఆ పదవిలోనే కొనసాగారు. 1994 నుండి శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం ట్రస్టుబోర్డులో సభ్యుడిగాను, పలుసార్లు ఛైర్మెన్‌గానూ స్వామి సేవలో పనిచేసాడు. 1995లో జరిగిన నెల్లూరు మున్సిపల్ ఛైర్మెన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా 36ఓట్లతో నెగ్గిన వివేకా రాజకీయ యాత్ర అక్కడ నుండే ఊపందుకుంది. 1983 నుండి తెలుగుదేశంలో వుండి 1985లో కొంతకాలం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌గా కూడా పనిచేసిన వివేకాకు ఆ పార్టీలో వున్నంతకాలం అంతకుమించిన అవకాశాలు రాలేదు. 1985ఎన్నికల్లో నెల్లూరు సీటును ఆశిం చినా ఇవ్వలేదు. 1989ఎన్నికల్లోనూ ఆయనకు మొండిచేయే చూపారు. దీంతో 1992లో కాంగ్రెస్ లోకి వెళ్ళిన ఆయనకు 1995లో నెల్లూరు మున్సిపల్ ఛైర్మెన్ కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశం ఇచ్చింది. తెలుగుదేశం ప్రభుత్వం నడుస్తున్న ఆ కాలంలో వివేకా 36ఓట్లతేడాతో వై.టి.నాయుడుపై సంచలన విజయం సాధించాడు. నాలుగేళ్ళపాటు మున్సి పాల్టీలో చక్రం తిప్పాడు. అప్పుడే మున్సిపల్ ఛైర్మెన్‌ల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా వ్యవహరిం చాడు. 1999ఎన్నికల ద్వారా ఎమ్మెల్యేను కావాలను కున్న తన చిరకాల స్వప్నాన్ని నెరవేర్చుకున్నాడు. 1999 అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లూరు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా నేదురుమల్లి జనార్థన్‌రెడ్డిని సైతం ఢీకొట్టి వై.యస్ ఆశీస్సులతో టిక్కెట్ తెచ్చుకు న్నాడు. బీజేపీ అభ్యర్థి దేగా నరసింహారెడ్డిపై గెలుపు సాధించారు. ఐదేళ్ళ పాటు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా విలక్షణ పాత్ర పోషించారు. అధికారపక్షానికి చుక్కలు చూపించారు. 2004 ఎన్నికల్లో మళ్ళీ నెల్లూరు నుండే రెండోసారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందారు. సరిగ్గా అప్పుడే రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కావడంతో జిల్లా రాజకీయాల్లో ఆనం హవా మరోసారి మొదలైనట్లయ్యింది. ఆనం సోద రులు నెల్లూరుజిల్లాలో వై.యస్.కు ముఖ్యఅనుచరు లుగా ముద్రపడ్డారు. వై.యస్. అండతో పార్టీలో నేదురుమల్లి జనార్థన్‌రెడ్డి వర్గాధిపత్యాన్ని సవాల్ చేస్తూ తమ వర్గాన్ని పెంచుకున్నారు. ప్రతి నియోజక వర్గంలో ఆనం వర్గం ఏర్పడింది. 2007లో వై.యస్. క్యాబినెట్‌లో ఆనం రామనారాయణరెడ్డి మంత్రయ్యాడు. పెద్దవాడిగా వివేకా అడిగితే మంత్రి పదవి వచ్చే అవకాశమున్నా ఆయన ఆనాడు తనకు కాకుండా తన తమ్ముడి కోసమే మంత్రి పదవి అడిగి సోదరుల పట్ల తన వాత్సల్యం చాటుకున్నారు. వై.యస్. కొలువులో రామనారాయణరెడ్డి మంత్రి అయ్యాక ఆనం జోరు మరింత పెరిగింది. 2009 ఎన్నికల నాటికి నేదురు మల్లిపై పైచేయి సాధించారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో కొత్తగా ఏర్పడ్డ నెల్లూరురూరల్ నుండి పోటీ చేసిన వివేకా ప్రజారాజ్యం అభ్యర్థి తన సమీప బంధువు ఆనం వెంకటరమణారెడ్డితో గట్టిపోటీనెదుర్కొని 3131ఓట్లతో అతి కష్టం మీద గట్టెక్కారు. 2009 సెప్టెంబర్‌లో వై.యస్.రాజశేఖరరెడ్డి మరణం చాలా మంది కాంగ్రెస్ నాయకుల జీవితాలలో పెను మార్పులు తెచ్చింది. రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిలు ముఖ్య మంత్రులయ్యారు. కాని, చాలామంది కాంగ్రెస్ నాయకులు రాజకీయంగా తెరమరుగ య్యారు. కొందరు గత వైభవాన్ని కోల్పోయారు. వారిలో ఆనం వివేకా కూడా వున్నారు. వై.యస్. మరణానంతరం తొలిరోజుల్లో జగన్‌కు అండగా నిలిచి ఆయన తరపున గట్టిగా పోరాడిన వివేకా ఆ తర్వాత కొద్దిరోజులకే తన వాణిని మార్చారు. జగన్‌కు వ్యతిరేకంగా గళం విప్పారు. జగన్ కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీని ధిక్కరించడం, 2012లో కాంగ్రెస్ పార్టీ నుండి బయటకొచ్చి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని స్థాపించడం జరిగింది. ఈ దశలో జగన్‌పై వివేకా విమర్శలు తీవ్రస్థాయికి చేరాయి. తెలుగుదేశం నాయకులు కూడా జగన్‌పై ఆరోపణలు చేయనంతగా వివేకా ఆరోపణలు చేసారు. జగన్‌పై వివేకా చేసిన ఆరోపణలను ఆయన అనుచరులు, అభిమానులు సైతం జీర్ణించుకోలేకపోయారు. వై.యస్. మరణంతో ఆనంకు ఓ రకంగా రాజకీయ గ్రహణం పడితే, 2014లో జరిగిన రాష్ట్ర విభ జనతో మరోరకంగా నష్టం కలిగింది. విభజనతో ఏపిలో కాంగ్రెస్ పతనమైంది. 2014 ఎన్నికల చివరి వరకు సీఎం కుర్చీ మీద ఆశతో ఆనం సోదరులు కాంగ్రెస్‌లోనే వుండిపోయారు. 2014 ఎన్నికల్లో వివేకా పోటీ చేయకుండా నెల్లూరు నగరం నుండి తన కొడుకు ఏ.సి.సుబ్బారెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థిగా దించాడు. ఆ ఎన్నికల్లో ఆయనకు కనీసం డిపాజిట్ కూడా దక్కలేదు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం అధికారంలోకి రావడం జరిగింది. 2015లో ఆనం వివేకా, ఆనం రామనారాయణ రెడ్డిలు తెలుగుదేశంలో చేరారు. పార్టీలో చేరేటప్పుడు ఆనం వివేకాకు ఎమ్మెల్సీని, ఆనం రామనారాయణ రెడ్డికి ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ హామీ ఇచ్చారు. అయితే రామనారాయణ రెడ్డికి ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ అయితే ఇచ్చారు గాని ఎమ్మెల్సీ విషయంలో వివేకాకు మొండిచేయి చూపారు. దీనికితోడు పార్టీలో ఆనం బ్రదర్స్‌కు అవమానాలే మిగిలాయి. కాంగ్రెస్‌లో నెల్లూరు జిల్లాను ఏకఛత్రాధిపత్యంగా ఏలిన ఆనం సోదరులకు టీడీపీలో కనీసం పార్టీ సమావేశాలకు కూడా ఆహ్వానం కరువైంది. ఇలా రాజకీయ శూన్యం ఆవహించిన సమయంలోనే ఆయన తీవ్ర అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరారు. నిర్జీవంగా నిన్న నెల్లూరుకు తిరిగివచ్చారు.

నెల్లూరుజిల్లా రాజకీయాలంటే ఈ తరానికి గుర్తొచ్చే నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య, బెజవాడ గోపాలరెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏ.సి.సుబ్బారెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, వెంకయ్య నాయుడు... రాజకీయ చరిత్రలో వీరందరిదీ ఓ శైలి. కాని, ఆనం వివేకానందరెడ్డి... విలక్షణ రాజ కీయాలకు బ్రాండ్ అంబాసిడర్. 20ఏళ్ళ పాటు నెల్లూరు నగరాన్ని శాసించిన లీడర్. కుర్రాడు, వృద్ధుడు అనే తేడా లేకుండా నెల్లూరీయుల మన సుల్లో వివేకాగా ముద్రపడ్డ నాయకుడు.

మాజీమంత్రి స్వర్గీయ ఆనం వెంకటరెడ్డి నలుగురి కుమారులలో పెద్దోడు. పెద్దనాన్న ఏ.సి. సుబ్బారెడ్డి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న నాయకుడు. ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డిల తరం తర్వాత ఆనం వంశ రాజకీయాలను నడి పించిన దమ్మున్న నేత. అలాంటి నాయకుడిని కోల్పోయింది నెల్లూరు. ఇలాంటి నాయకుడు మళ్ళీ జన్మించడానికి ఎన్నేళ్ళు పడుతుందో?

తాను నమ్మిన సిద్ధాంతమే వేదంగా, తనను నమ్మిన అనుచరగణమే ఆయుధంగా సుదీర్ఘ రాజ కీయ ప్రస్థానాన్ని కొనసాగించి అదే రాజకీయంతోనే కొనఊపిరి వొదిలిన ఆనం వివేకానందరెడ్డికి నివాళులర్పిస్తూ... వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.



జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో వివేకా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్యాంకు ఛైర్మెన్ ధనుంజయరెడ్డి, వైస్‌ఛైర్మెన్ జగన్మోహన్‌రెడ్డి, బ్యాంకు సిబ్బంది



నివాళులర్పిస్తున్న మంత్రులు అమర్‌నాథ్‌రెడ్డి, సోమిరెడ్డి



శ్రద్ధాంజలి ఘటిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్సీ బీద



అశ్రునయనాలతో రాజ్యసభ సభ్యుడు విపిఆర్



ఎంపీ మేకపాటి, ఎమ్మెల్యే కాకాణి అశ్రునివాళి



అంజలిఘటిస్తున్న మాజీఎమ్మెల్యే జె.కె.రెడ్డి



నివాళులర్పిస్తున్న మాజీ కేంద్రమంత్రి పనబాక దంపతులు



నివాళులర్పిస్తున్న కలెక్టర్ ముత్యాలరాజు, ఎస్పీ రామకృష్ణ

# బాలయ్య.. ఈ మాటలేంటయ్యా!

**- కోలా విమర్శ**



సినీనటుడు బాలయ్య మాటలు మతి తప్పిన మాటలుగా ఉన్నాయని, ప్రధాని నరేంద్రమోడీని అమర్యాదగా మాట్లాడడం సబబుకాదని శ్రీకాళహస్తీశ్వ రాలయ ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మెన్, బిజెపి నాయడు కోలా ఆనంద్ అన్నారు. ఉద్యమాలంటే రంగులు పూసుకుని, నాలుగు డైలాగులు చెప్పడం కాదని ఆయన విమర్శించారు. నిన్నమొన్నటిదాకా ప్రధాని మోడీని పొగిడిన బాలకృష్ణ ఇప్పుడు ప్రధానిపై లేనిపోని విమర్శలకు దిగుతుండడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తన ఇంట్లోనే హత్యలు చేసిన బాలకృష్ణ వెనుక ఎన్నో కారణాలున్నాయన్నారు. ప్రధాని మోడీపై లేనిపోని మాటలు మాట్లాడితే సహించేది లేదన్నారు. రానున్న కర్నాటక ఎన్నికల్లో బిజెపి తప్పకుండా గెలిచి తన సత్తా చూపుతుందన్నారు. కేంద్ర కేబినెట్‌లో ఉన్న బిజెపి మంత్రులెవరూ కూడా అవినీతికి పాల్పడలేదని, నిజాయితీగా ప్రజలకు సేవలందిస్తున్నారని ఆయన అన్నారు. బాలయ్య ఇకనైనా అమర్యాద మాటలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, పట్టణ బిజెపి అధ్యక్షుడు పగడాల రాజు, సునీతాసింగ్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తి న్యూస్

# ప్రత్యేకహోదా ఇవ్వాల్సిందే...



రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధన కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ధర్మపోరాట దీక్షకు మద్దతుగా ఇటీవల కాళహస్తిలో మాజీ ఎమ్మెల్యే, టిడిపి నాయకుడు ఎస్‌సివి నాయుడు, మాజీమంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తనయుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరాహారదీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌సివి నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అశాస్త్రీయంగా విభజన చేసి కాంగ్రెస్ ఫలితం అనుభవించిందన్నారు. విభజన నష్టాలను పూడ్చి రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నేడు హోదా లేదు.. ప్యాకేజీ లేదు అంటూ ఆంధ్ర ప్రదేశ్‌కు తీరని అన్యాయం చేస్తోందని, ప్రధాని నరేంద్రమోడీ రాష్ట్రానికి మోసం చేశారని ఆరోపించారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అన్నారు. ఈ నిరాహారదీక్ష కార్యక్రమంలో మాజీ మునిసిపల్ ఛైర్‌పర్సన్ ఆర్.మ్యాగీక్లారా, మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యులు లోకనాధంనాయుడు, చిట్టివేలు జయగోపాల్, నారాయణయాదవ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## కాలధర్మం

# నూకలపాటి ఆదిశేషారెడ్డి



మండల కేంద్రమైన అల్లూరు గ్రామ వాస్తవ్యుడు, పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబాను నిరంతరం ఆరాధించే భక్తుడు నూకలపాటి ఆదిశేషారెడ్డి ఈ నెల 18వ తేదీన మరణించారు. ఆయన వయస్సు 98 సంవత్సరాలు. 1920లో నూకలపాటి రామిరెడ్డి-లక్ష్మీదేవమ్మ పుణ్యదంపతులకు ఆదిశేషారెడ్డి జన్మించారు. దేగపూడి అన్నపూర్ణమ్మతో ఆయనకు వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. కుమార్తె గీతాభారతి, కుమారుడు నాగజనార్ధన్‌రెడ్డి. నూకలపాటి ఆదిశేషారెడ్డి తొలినుంచి ఆధ్యాత్మికరంగంలో ఉంటూ భగవదారాధకునిగా ఎన్నో దైవకార్యాలు నిర్వహించేవారు. శ్రీకాళహస్తిలోని శుకబ్రహ్మాశ్రమానికి, ఏర్పేడులోని వ్యాసాశ్రమానికి నిరుపమానమైన సేవలందించారు. అల్లూరులోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానానికి, ఆలయంలో కల్యాణమండపం ఏర్పాటుకు తనవంతు చేయూతనందించారు. అదేవిధంగా, అల్లూరులోని రామకృష్ణా జూనియర్ కాలేజీ కమిటీ సభ్యులుగా మరియు స్థలదాతలుగా ఉంటూ విద్యాదాతగా పేరుగడించారు. అల్లూరులో గిరిజనకాలనీలో ఇళ్ళ నిర్మాణానికి అవసరమైన డిపాజిట్టు మొత్తాన్ని తనే చెల్లించి, గిరిజనులకు ఇళ్ళు నిర్మించేందుకు ఎంతో సాయం చేశారు. అటు ఆధ్యాత్మిక రంగంలోనూ ఇటు సామాజిక సేవారంగంలోనూ ఎన్నో కార్యక్రమాలు చేపట్టి వితరణగుణశీలిగా ఉంటూ తన సేవాభావాన్ని చాటుకున్నారు. తన ఆరాధ్యదైవమైన శ్రీ సత్యసాయి సన్నిధిలోనే గడిపేందుకు పాతికేళ్ళ క్రితమే నిర్ణయించుకుని పుట్టపర్తికి వెళ్ళారు. పుట్టపర్తిలోనే ఉంటూ ఆ పరిసర గ్రామాల్లోని పేదలకు కూడా ఆయన తన వంతు సేవలందించేవారు. నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేయడం, చలికాలంలో పేదలకు కంబళ్ళు అందివ్వడం, పేదమహిళలకు కుట్టుమిషన్లు అందజేయడం, పాఠశాలలకు రావాలంటే ఆర్థికస్తోమతు లేక నిత్యం ఎన్నో అవస్తలు పడుతున్న పేద విద్యార్థులకు ఆటోఛార్జీలు ఇవ్వడం, నిరుపేదలకు స్కూలు ఫీజులు కూడా తనే చెల్లించడం వంటి సేవాకార్యక్రమాల్లో ఎప్పుడూ ఆయన ముందుండేవారు. పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం క్యాంటీన్‌లో సుమారు పాతికేళ్ళుగా సేవలందించారు. ఈనెల 18వ తేది బుధవారం రాత్రి 9 గంటలకు పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోనే..ఎస్-2, బి-3 నివాసంలో ఆయన శ్రీ సత్యసాయిలో ఐక్యమయ్యారు. జీవితాన్ని ఆధ్యాత్మిక-సేవా రంగాలకు అర్పించిన ధన్యజీవి ఆయన. తానెంతో భక్తితో ఆరాధించే పుట్టపర్తిలోనే తనువు చాలించిన పుణ్యమూర్తి ఆయన. ఆదిశేషారెడ్డి సోదరుడు నూకలపాటి రమణారెడ్డి అల్లూరు గ్రామానికి తొలి సర్పంచ్‌గా ఆరోజుల్లో ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందారు. ఈయన నూకలపాటి అనిల్‌కి తాత అవుతాడు. ఆదిశేషారెడ్డి మరణానికి చింతిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలుపుతోంది 'లాయర్'.

# ఉత్తమ సేవలకు అవార్డులు




శ్రీకాళహస్తి పట్టణంలోని సౌత్‌సెంట్రల్ రైల్వే సిగ్నల్ విభాగంలో పనిచేస్తున్న సిఎస్‌ఐ దామోదరరావు ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న పలువురు సిబ్బంది ఉత్తమ సేవా అవార్డులను అందుకున్నారు. 2017-18 సంవత్సరానికిగాను అందజేసిన ఈ అవార్డులను అందుకున్న సిబ్బందిలో విఆర్ ప్రసాద్, కె.లోకనాధం, డి.సుధాకర్, రాము తదితరులున్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రైల్వే ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో అవార్డులతో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డుగ్రహీతలు మాట్లాడుతూ, ఈ అవార్డుల ద్వారా తమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఉన్నతాధికారులు దామోదరరావు, మణివర్ణన్ తదితరులు అవార్డు గ్రహీతలను అభినందించారు.

## మరో ఆణిముత్యం..

# జెస్సీ ప్రశాంతి

- కష్టపడి చదివితే సాధించలేనిదేమీ ఉండదు
- స్వయంకృషితో డిఎస్పీగా ఎంపిక



తల్లిదండ్రులతో జెస్సీ ప్రశాంతి

కష్టపడి చదివితే సాధించలేనిదేమీ ఉండదు. జీవితంలో రాణించాలంటే విద్యారంగంలో ఒక లక్ష్యం అంటూ ఉండాలి. అంతేకాదు, ఆ లక్ష్యాన్ని సాధించడానికి నిరంతరం శ్రమించాలి. అప్పుడే అనుకున్న లక్ష్యం సాధించగలం...అంటున్నారు ఇటీవలే డిఎస్పీగా ఎంపికైన యెండ్లూరు జెస్సీ ప్రశాంతి. ఆమె స్వస్థలం తోటపల్లి గూడూరు మండలం పాపిరెడ్డిపాళెం గ్రామం.

తండ్రి యెండ్లూరు శ్యామసుందరం ప్రస్తుతం తిరుపతిలో పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. తల్లి సునీత వినోదిని తిరుపతి పద్మావతి మహిళా యూనివర్శిటీలో ఉద్యోగినిగా ఉన్నారు.చెల్లెలు మెర్సీస్రవంతి నెల్లూరు నారాయణ డెంటల్ కాలేజ్‌లో ఎండిఎస్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. తమ్ముడు డానియేల్ సుకుమార్ బిటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో సివిల్ సర్వీసెస్‌కి ప్రిపేరవుతున్నాడు. ఇలా వారంతా చదువుల తల్లి ముద్దుబిడ్డలే కావడం సింహపురి సీమకే గర్వకారణం. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో జెస్సీ ప్రశాంతి చిన్నప్పటినుంచి ఎంతో పట్టుదలగా చదువుకుంది. ఇప్పుడు మంచి ఉద్యోగం సాధించి తన ప్రతిభను నిరూపించు కుంది. అందులోనూ పోలీసుశాఖలో డిఎస్పీగా ఉన్నతమైన ఉద్యోగం సాధించి అందరికీ మార్గదర్శకంగా నిలుస్తోంది. మహిళారంగంలో మరో ఆణిముత్యంలా భాసిస్తోంది.

## ఎంబిఏలో గోల్డ్ మెడల్

జెస్సీ ప్రశాంతి చిన్నతనంలో తొలుత ఇన్‌ఫెంట్ జీసెస్‌స్కూల్‌లో ఎల్‌కేజీలో చేరి, ఆ తర్వాత చిత్తూరుజిల్లా చౌడేపల్లిలోని శ్రీవిజయవాణి రెసిడెన్షియల్ స్కూల్, యశోదా నగర్‌లోని లిటిల్‌ఏంజెల్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్య పూర్తిచేసింది. విద్యలో మంచి ప్రతిభాపాటవాలతో రాణిస్తూ సెవన్త్ చదివేటప్పుడే ముఖ్యమంత్రి నుంచి ప్రతిభ అవార్డును కూడా సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. తిరుపతిలో శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ పూర్తయ్యాక, రంగంపేటలోని శ్రీ విద్యానికేతన్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో బిటెక్ పూర్తిచేసింది. ఆ తర్వాత ఎస్వీ యూనివర్శిటీలో ఎంబిఏ పూర్తిచేయడం జరిగింది. ఎంబిఏలో గోల్డ్‌మెడల్ సాధించి కళాశాల అధ్యాపకుల ప్రశంసలందుకుంది. అనంతరం 2013 నుంచి హైదరాబాద్‌లో సివిల్ సర్వీసెస్‌కి కోచింగ్ తీసుకుని ప్రిపేర్ అవుతూవచ్చింది. 2016లో తొలిసారిగా గ్రూప్-2 పరీక్షలు రాసి ఉత్తీర్ణురాలు కావడంతో తహశీల్దార్ ఉద్యోగం వచ్చింది. కానీ, ఆ ఉద్యోగంలో చేరకుండా, మరికొద్ది రోజులు కష్టపడి గ్రూప్-1 పరీక్షలు రాసి మొదటి ప్రయత్నంలోనే డిఎస్పిగా ఎంపిక కావడం ఎంతైనా విశేషం. అందులోనూ గ్రూప్-1కి ఆమె ఎక్కడా కోచింగ్ తీసుకోలేదు కూడా. క్లిష్టమైన ఆ పరీక్షల్లో ఉత్తీర్ణురాలు కావడం ఆమె ప్రతిభకు నిదర్శనం.

## మా నాన్నగారే...స్ఫూర్తి

**- జెస్సీ ప్రశాంతి**

మా నాన్నగారే నాకు మంచి స్ఫూర్తి. చిన్నతనం నుంచి ఆయన పేదల కష్టాలు చెప్తుండేవారు. పేదల బాధలు బాగా వినేదాన్ని. వారి సమస్యలు కొన్నయినా తీర్చాలని నాకు అనిపిస్తుండేది. అందుకు, సివిల్ సర్వీసెస్‌లో మంచి పోస్టు సాధించాలన్నది చిన్నతనం నుంచి నా లక్ష్యంగా నిర్ణయించుకున్నాను. పత్రికల్లో వచ్చే సంపాదకీయాలు ఎంతో ఇష్టంగా చదివేదాన్ని. ఐఏఎస్, ఐపిఎస్‌లకు ఎంపికైన అనేకమంది ఇంటర్వ్యూలను సోషల్‌మీడియాలో ఆసక్తిగా చూసేదాన్నని ప్రశాంతి తెలిపారు.

# వైసిపిలోకి తిప్పిరెడ్డి మమత



నెల్లూరు, వేదాయపాలెంకు చెందిన యువ మహిళా నాయకురాలు తిప్పిరెడ్డి మమతారెడ్డి 25వ తేదీ తన బంధు మిత్రులతో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైసిపి రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆమెకు పార్టీ కండువా కప్పి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరి, నగర మహిళా అధ్యక్షురాలు తోటా శోభారాణి, విజయలక్ష్మి, మాధవి, శిరీష, సుజాత, అనిత, పెంచలమ్మ, జమున, భారతి, మైథిలి తదితరులు పాల్గొన్నారు.

**నెల్లూరు చరిత్రను రెండు భాగాలుగా విభజిస్తే స్వాతంత్ర్యానికి పూర్వం మనకు తెలిసిన రాజు మనుమసిద్ధి మహారాజు. నెల్లూరుసీమను గొప్పగా ఏలాడని పేరు. రెండో భాగంలో స్వాతంత్ర్యం అనంతరం చూస్తే నెల్లూరును ఏకచత్రాధిపత్యంగా 20ఏళ్ళ పాటు ఏలిన రారాజుగా ఆనం వివేకా మనకు కనిపిస్తాడు. జిల్లా రాజకీయాలలోనే కాదు, బహుశా రాష్ట్ర రాజకీయాలలో కూడా ఇలాంటి విలక్షణ, విశిష్ట రాజకీయ లక్షణాలున్న నాయకుడు మనకు కనిపించడు.**

## నెల్లూరు చరిత్రపై...

# చెరగని సంతకం.. వివేకా



### విలక్షణం అతని లక్షణం

రాజకీయాలలో విలక్షణతకు మారుపేరు వివేకా. ఆయన రూటే సపరేటు. అందరూ నడిచిన దారిలో ఆయన నడవడు. ఆయన ముఖ్యమంత్రి కాదు... కనీసం మంత్రిగా కూడా చేయలేదు. కాని రాష్ట్ర స్థాయిలో పాపులారిటీ సంపాదించాడు. వివేకా అంటే వెరైటీ నాయకుడు అనే బ్రాండ్ ఇమేజ్ తెచ్చుకున్నాడు. దీనికి కారణం ఆయన భాష... ఆయన గెటప్... ఆయన సెటప్... ఎలాంటి డ్రెస్‌లనైనా వేయగలడు. పంచ రంగుల కళ్ళద్దాలు పెట్టగలడు. ఎలాంటి టోపీనైనా తన తలపై పెట్టుకోగలడు. చిన్నపిల్లలతో కలిసిపోగలడు, వృద్ధులతో కలిసి నడవగలడు. అందుకే అలాంటి నాయకుడు ఇక నెల్లూరుకు దొరకడం కష్టమే.

### జీవితంలో ఆయనకి తోడు 9849459590

నాగార్జున హీరోగా నటించిన 'శివమణి' సినిమా చూసే వుంటారు. ఆ సినిమాలో హీరో పాత్రధారి నాగార్జున తన సెల్ నెంబర్ ప్రజలకిచ్చి.. ఏ క్షణంలోనైనా ఫోన్ చెయ్యండి... రెండు కిలోమీటర్ల దూరంలో వున్నా రెండు నిముషాల్లో మీముందుంటా అని చెబుతుంటాడు. వివేకా ధోరణి కూడా అలాగే వుండేది. సాధారణంగా ఎమ్మెల్యేల సెల్ నెంబర్లు సామాన్య ప్రజలకు దొరకడం కష్టం. దొరికినా వీళ్ళు ఫోన్ చేస్తే ఎమ్మెల్యేలు ఫోన్ ఎత్తడం ఇంకా కష్టం. కాని వివేకా అలా కాదు. ఆయన మున్సిపల్ ఛైర్మన్‌గా వున్నప్పటి నుండి కూడా ఆయన సెల్ నెంబర్ 9849459590 నెల్లూరు ప్రజల మైండ్‌లో ఎప్పుడూ వుండేది. ఎవరు ఏ సమయంలో ఏ సమస్య వచ్చి ఫోన్ చేసినా ఆయన ఎత్తుకునేవాడు. ఒకవేళ బిజీగా వుండి ఆ క్షణంలో ఫోన్ ఎత్తకపోయినా ఆయనే మిస్డ్‌కాల్స్ చూసి తిరిగి చేసేవాడు. ఇలా వివేకాతో ఫోన్ ద్వారా మాట్లాడినవాళ్ళు నగరంలో వేలమంది వున్నారంటే అతిశయోక్తి కాదు.

### 1995 నుండి 2017 దాకా...

వివేకా రాజకీయ ప్రయాణంలో అత్యంత విలువైన కాలం ఈ ఇరవైఏళ్ళే! సాధారణ రాజకీయ నాయకుడిగా వున్న ఆయనను ప్రజానాయకుడిగా, ప్రజాకర్షణ నాయకుడిగా, ప్రజానాడి తెలిసిన నాయకుడిగా, ప్రజాదరణ పొందిన నాయకుడిగా మలచింది ఈ 20ఏళ్ళ కాలమే! 1995లో మున్సిపల్ ఛైర్మన్‌గా గెలుపొందాక ఆయన పూర్తిస్థాయిలో ప్రజల మధ్య తిరగసాగాడు. ప్రజల మనసులు గెలుచుకున్నాడు. ప్రజలకు అందు బాటులో వుండే నాయకుడిగా గుర్తింపు పొందాడు. ఆ ప్రజాభిమానం వల్లే వరుసగా మూడుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాడు. 20ఏళ్ళ పాటు నెల్లూరు నగరాన్ని ఏలిన ఏకైక నాయకుడు వివేకా అనిపించుకున్నాడు.

### నెంబర్ వన్ భక్తుడు

వివేకాలో భక్తి విశ్వాసాలు మెండుగా వుంటాయి. నిద్రలేస్తే ఆయన ప్రస్థానం ఏదో ఒక గుడి వద్ద నుండే మొదలవుతుంది. రంగనాథస్వామి గుడి, మూలాపేట శివాలయం, వేణుగోపాలస్వామి గుడి, సుబ్రహ్మణ్య స్వామి గుడి, రాజరాజేశ్వరమ్మ, ఇరుకళలమ్మ దేవాలయాలను ఆయన తరచూ దర్శించుకుంటుంటారు. ఆరోగ్యం బాగున్నంతకాలం శరన్నవరాత్రుల రోజుల్లో రాజరాజేశ్వరమ్మ గుడిలో రోజూ 108 ప్రదక్షిణలు చేసేవాడు. ఇక బారాషహీద్ దర్గా వద్ద జరిగే రొట్టెల పండుగన్నా, గుడ్‌ఫ్రైడే నాడు శిలువను మోయడం అన్నా ఆయనకు ఎంతో ఇష్టం. తరచూ తిరుమలకు వెళ్ళి శ్రీవారి దర్శనం చేసుకునేవాడు. వెంకటేశ్వరస్వామితో పాటు ఏసు ప్రభువును కూడా అమితంగా విశ్వసిస్తాడు.

### నెల్లూరు వ్యాపారులకు బ్రాండ్ అంబాసిడర్

నెల్లూరులో వాణిజ్య సంస్థల వాళ్ళు తమ షోరూంల ప్రారంభోత్సవాలకు ఇప్పుడు సినిమా యాక్టర్లను తీసుకొస్తున్నారుగాని, ఒకప్పుడు నగరంలో ఏ షోరూం అయినా, ఏ షాపైనా ఆయన చేతుల మీదుగా ప్రారంభించాల్సిందే! ఆయన చేత్తో ప్రారంభించిన వ్యాపారం ఏదైనా బాగా జరుగుతుందనే నమ్మకం నెల్లూరీయులలో వుంది. అందుకే ఆయన డేట్స్ తీసుకుని మరీ ఓపెనింగ్‌లు పెట్టుకునేవాళ్ళు.

### సినిమా, సిగరెట్ ఆయన బలహీనతలు

సెకండ్‌షో సినిమా అన్నా, 'డ్రమ్' సిగరెట్లన్నా ఆయనకు భలే ఇష్టం. వారంలో కనీసం 7సినిమాలన్నా చూడాల్సిందే, రోజుకి 20 సిగరెట్లన్నా తాగాల్సిందే!

### కిర్రు చెప్పులు

ఏదైనా వెరైటీగా చేసే వివేకా, వేసుకునే చెప్పులు కూడా వైవిధ్యమే. ప్రత్యేకంగా తయారు చేయించుకున్న కిర్రుచెప్పులనే ఆయన ఎక్కువగా వాడేవాడు.

### కాపువీధికి కాపలాదారుడు

కాపువీధిలో బంగారు షాపులు, గుడ్డల అంగళ్ళు, ఇతర వ్యాపార సంస్థలు దండిగా వుంటాయి. వాటిలో విలువైన వస్తువులుంటాయి. అయితే రాత్రిళ్ళు ఇక్కడ కాపలాదారుడు, సెక్యూరిటీ గార్డులను నియమించుకునే పనుండేది కాదు. కాపువీధికి వివేకానే కాపలాదారుడు. రాత్రిళ్ళు ఆయన వెంట అనుచరులు కూడా ఉండేవాళ్ళు. దీంతో అర్ధరాత్రి దాటాక కూడా ఈ సెంటర్‌లో జనం వుంటుండడంతో దొంగలకు ఇటువైపు దోపిడీ ఆలోచన వచ్చేది కాదు.

### మీడియాకు మిత్రుడు

వివేకా రాజకీయ ప్రస్థానంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ మీడియా పాత్ర చాలా వుంది. మీడియా ప్రతినిధులను ఎంతో గౌరవించేవాడు. అభిమానించేవాడు. నెల్లూరు మీడియాలో చాలా మంది విలేకరులకు ఆయన ఆప్తమిత్రుడు. 2008లో దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వున్న సమయంలో కొత్తూరు వద్ద 20ఎకరాల భూమిని జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలకు కేటాయించడంలో వివేకా చేసిన కృషిని ఇంటి స్థలం పొందిన ఏ విలేకరి కూడా మరువలేడు.

### నలుగురికీ నచ్చినదీ... నాకసలే నచ్చదులే!

నలుగురికీ నచ్చేది వివేకాకు నచ్చదు. జనానికి నచ్చనిది ఆయనకు నచ్చుతుంది. అదే ఆయన స్పెషల్. '8' అంకెను ఎవరూ ఇష్టపడరు. కాని వివేకా కొనే ప్రతి కారుకు '8' టోటల్ నెంబర్ వుంటుంది. ప్రతి కారుపై 116 రిజిష్టర్ నెంబర్ వుంటుంది. ఇక ఒంటెల బొమ్మలను ఇంటిలో పెట్టుకోవడం అశుభం అనుకుంటారు, కానీ వివేకా బెడ్‌రూంలోనే కాదు, ఆయన కారు వెనుక కూడా ఒంటె బొమ్మలే వుంటాయి. అమావాస్య, రాహుకాలం, యమగండం మనం అశుభం అనుకుంటే ఆయన ఆ కాలాలలోనే ఏ పనైనా మొదలుపెడతాడు.

### ఆహారప్రియుడు

సాంప్రదాయ వంటలను వివేకా ఎక్కువగా తినేవాడు. నాటుకోడి, తలకాయ కూర, చేపల పులుసు, బిర్యాని... వేణుగోపాల స్వామి గుడిలో చేసే హల్వా, పొంగలి, దద్ధోజనం అంటే ఎంతో ఇష్టంగా తినేవాడు.

### 'గల్పిక' ద్వారా 'స్టైల్ ఆఫ్ సింహపురి'

'పద్మశ్రీ', 'పద్మభూషణ్' వంటి బిరుదులు ఇచ్చివున్నా వివేకాలో సంతోషం వుండేది కాదేమో... కాని 'స్టైల్ ఆఫ్ సింహపురి' అనే బిరుదు మాత్రం ఆయనను ఎంతో సంతోషపరిచేది. ఆ పేరుతో ఆయనను సంభోదిస్తుంటే ఎంతో ఆనందపడేవాడు. 1998 నుండి 'లాయర్' వారపత్రికలో వస్తున్న 'గల్పిక' శీర్షిక ద్వారా ఆయనను 'స్టైల్ ఆఫ్ సింహపురి'గా పాఠకులకు పరిచయం చేసే అదృష్టం 'లాయర్'కు దక్కింది. క్రమేణా అది వాడుకలోకి వచ్చి ఆయన అభిమానులు, అనుచరుల మనసుల్లోకి ఎక్కిపోయింది. ఈరోజు 'స్టైల్ ఆఫ్ సింహపురి వివేకా'గా రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారంలోకి వచ్చింది. 'లాయర్' పత్రికలో వారం వారం వచ్చే వ్యంగ్య రాజకీయ కథనం 'గల్పిక' శీర్షిక అంటే ఆయనకు ఎంతో ఇష్టం. ఈ శీర్షిక ద్వారా వెలువడిన అనేక స్టోరీలలో ఆయనదే ప్రధాన పాత్రగా వుండేది. గల్పికకు ఆయనకు అవినాభావ



సంబంధముండబట్టే 2007 జూన్10న జరిగిన 'లాయర్' 26వ వార్షికోత్సవ వేడుకల్లో 'గల్పిక' శీర్షికల మొదటి భాగం పుస్తకాన్ని ఆయన చేతుల మీదుగానే ఆవిష్కరించడం విశేషం.

వివేకా జీవిత చరిత్ర చాలా పెద్దది. అతని జీవితం 67ఏళ్లే అయినా ఇంకా 67ఏళ్ళకు చెప్పుకోవడానికి సరిపడా విశేషాలు ఆయన జీవితంలో కనిపిస్తాయి. తవ్వుకుంటూ పోతుంటే తరగని జ్ఞాపకాల గని వివేకా!






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com